Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

WANTED
Office Assistant-1
Jr. Accountant-1
For an Audit Firm
at Seethammadhara
Call : 95334 94102

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 123 విశాఖపట్నం, 21 ఫిబ్రవరి 2024 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## అందుకే ఆర్టికల్ 370ని రద్దు చేశాం



ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాలుగేళ్ల తర్వాత మంగళవారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రూ.32 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. 2014తో పోలిస్తే కశ్మీర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల ప్రజలతో వీడియో కాన్ఫరెన్స్‌తో ముచ్చటించారు. విద్యా, వైద్య రంగాల్లో జమ్ముకశ్మీర్‌కు కేంద్రం పెద్ద పీట వేస్తునట్టు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన 15000 మందికి జాబ్ సర్టిఫికేట్లను అందజేయడంతో పాటు వారందరినీ అభినందించారు. జమ్ముకశ్మీర్ యువత ఆకాంక్షలను తమ ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందన్నారు మోదీ. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందన్నారు. అవినీతిని, వారసత్వ రాజకీయాలను జమ్ముకశ్మీర్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు మోదీ. ఆర్టికల్ 370 జమ్ముకశ్మీర్ అభివృద్ధికి అడ్డంకి గా ఉందన్నారు మోదీ. అందుకే ఆర్టికల్ 370ని రద్దు చేసినట్టు తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్ముకశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లు, ఎన్డీఏ కూటమికి 400 సీట్లు ఖాయమన్నారు.

**లబ్ధిదారులతో ప్రధాని మోదీ సంభాషణ**

జమ్మూ కాశ్మీర్‌లో రూ. 32,000 కోట్ల విలువైన విద్య, రైల్వే, విమానయానం, రోడ్డు రంగాలకు సంబంధించిన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. జమ్మూ నుంచి ప్రధాని దేశవ్యాప్తంగా రూ. 13,500 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. అంతేకాకుండా

(మిగతా 2లో)

## ఆ పథకాల నిధులను విడుదల చేసిన సిఎం వైఎస్ జగన్



వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిధులను విడుదల చేశారు. అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లల్లోకి 78.53 కోట్ల రూపాయల మొత్తాన్ని బటన్ నొక్కి జమ చేశారు. ఇది- అయిదో విడత నిధులు విడదల. 10,132 జంటలకు ఈ మొత్తం అందింది.

ఇప్పటి వరకు ఈ రెండు పథకాల కింద 56,194 జంటలు లబ్ధి పొందాయి. వారి ఖాతాల్లోకి 427.27 కోట్ల రూపాయలు జమ అయ్యాయి. ఈ పథకం కింద వధూవరులు లబ్ధి పొందాలంటే ఖచ్చితంగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తమ 10వ తరగతి సర్టిఫికెట్‌ను వారు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఈ నిబంధనను ఎందుకు పెట్టాల్సి వచ్చిందనే విషయాన్ని వైఎస్ జగన్ వివరించారు. చదువును ప్రోత్సహించడంలో భాగంగా 10 తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధనను పెట్టామని అన్నారు. వయో పరిమితి వధువుకు 18 సంవత్సరాలు, వరుడికి 21 సంవత్సరాలు ఉండాలనే మరో నిబంధన కూడా ఉందని, బాల్య వివాహాలను నిరోధించడం, వయస్సు నిండకుండా పెళ్లి చేసుకోవడాన్ని అడ్డుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

10వ తరగతి పూర్తయిన వెంటనే ఇంటర్మీడియట్ చదువుకునేలా అమ్మఒడి పథకం కింద ప్రోత్సాహం అందిస్తున్నామని, ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చే విద్యా దీవెన పథకం అమలులో ఉన్నందున డిగ్రీ వరకు చదువుకుంటారని జగన్ వివరించారు.

డిగ్రీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ కోసం వసతి దీవెన కింద ఏటా 20,000 రూపాయలను ఇస్తోన్నామని,

(మిగతా 2లో)

## మరోసారి కోడికత్తి కేసు విచారణ వాయిదా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కోడికత్తి కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. మంగళవారం ఉదయం ఎన్ఐఏ కోర్టు జడ్జ్ సెలవులో ఉండడంతో ఎన్ఐఏ ఇన్‌చార్జ్ కోర్టులో ఈ కేసుకు సంబంధించి వాదనలు జరిగాయి.

ఈ కేసులో బెయిల్ తర్వాత తొలిసారిగా కోడికత్తి శ్రీను కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసు విచారణను ఏప్రిల్ 19కి ఏన్ఐఏ ఇన్‌చార్జ్ కోర్టు వాయిదా వేసింది.

వాయిదా అనంతరం లాయర్ సలీమ్ మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో జగన్ తన వాంగ్మూలం ఇవ్వాలన్నారు.

(మిగతా 2లో)

## బిజెపి జిల్లా ట్రేడర్స్ సెల్ కన్వీనర్‌గా కురిచేటి రామచంద్ర మూర్తి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ట్రేడర్స్ సెల్ కన్వీనర్‌గా కురిచేటి రామచంద్ర మూర్తిని నియమిస్తూ బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కురిచేటి రామచంద్ర మూర్తి మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన జిల్లా అధ్యక్షులు రవీంద్రకి కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవకాంత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా॥ కె. సుహాసిని ఆనంద్, బీజేపీ సీనియర్ నాయకులు ఎస్‌వీఎస్ ప్రకాష్ రెడ్డి, బీజేపీ విశాఖ పార్లమెంట్ కన్వీనర్ ఎస్.ఎ.రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



## వైసిపి పాలనలో రాష్ట్రం గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మారింది

**మాడుగుల, (విశాఖ సమాచారమ్):** పోరాటాల, పౌరుషాల గడ్డ ఈ ఉత్తరాంధ్ర. చంద్ర బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా జాబ్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా ఉండేది. నేడు గంజాయి కేపిటల్ ఆఫ్ ఇండియాగా మారిందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సోమవారం ఘాట్ రోడ్డు జంక్షన్ వద్ద జరిగిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. బాబు హయాంలో అనేక పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాం. నెలకు రెండు సార్లు ఆయన విశాఖకు వచ్చేవారు. నేడు రోజుకో మర్డర్, కిడ్నాప్, భూకబ్జాలు చోటుచేసుకుంటున్నాయి. వైకాపా సొంత ఎంపీ కొడుకు, భార్యే కిడ్నాప్ చేశారంటే సామాన్యుల పరిస్థితి ఏమిటో ఆలోచించాలి. వైకాపా భూకబ్జాలకు సహకరించలేదని ఎమ్మార్వో రమణయ్యను కొట్టి చంపారు. జగన్ ప్రతి మీటింగ్ లో ఓ మాట అంటున్నారు. తన తండ్రి వయసున్న వ్యక్తిని ముసలోడు, ముసలోడు అంటున్నారు. ఈ రోజుతో ముసలోడు ఎవరో తేలిపోవాలి.



జగన్ బస్సు దిగాలంటే స్టూల్ వేయాలి. కొబ్బరికాయ కొట్టాలంటే ఇద్దరు ఆ రాయి ఎత్తాలి. అప్పుడు నడుం దించకుండా కొబ్బరికాయ కొడతాడు. బైక్ నడపాలంటే ఇటు నలుగురు, అటు నలుగురు పట్టుకోవాలి. ఏకంగా గత ఐదేళ్లుగా ఒక్క గంట కూడా సమీక్ష చేయలేదు. 6 కాగానే ఇంటికి వెళ్లి పడుకుంటాడు. ఇది జగన్ పరిస్థితి అని ఎద్దేవా చేశారు. నేను సవాల్ విసురుతున్నా మై డియర్ జగన్, తిరుపతి కొండనో, రామతీర్థం కొండనో చంద్రబాబు, మీరు కలిసి ఎక్కండి. మీరు ముందు వస్తారో, చంద్రబాబు వస్తారో తేలిపోతుంది. ఎవరు కుర్రడో, ముసలోడో తేలిపోతుంది అన్నారు. గత ఐదేళ్లుగా 32 వేల పాఠశాలల్లో ప్రారభించిన పనులు ఎక్కడివి అక్కడే ఉన్నాయి. మనం కట్టిన భవనాలకు రంగులేసి తాను కట్టినట్లుగా చెప్పుకుంటున్నారు. విద్యను పిల్లలకు దూరం చేస్తున్నారు. 117 జీవోతో పాఠశాలలు విలీనం చేసి విద్య దూరం చేస్తున్నారు. దీనివల్ల పిల్లలు చదువుకు దూరమవుతున్న వారిలో దక్షిణ భారతంలోనే ఏపీ ఒకటో స్థానం ఉంది. దేశంలో 12.6 శాతం ఉంటే ఏపీలో 16.3 శాతం డ్రాప్ అవుట్లు ఉన్నాయి. 2022-23లో లక్షా 93వేల మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యలో చదువు ఆపేశారు. మేం వస్తే 117 జీవో రద్దు చేసి.. విద్యను ప్రతి గడపకు తీసుకెళ్తాం. ఆనాడు ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, ప్రహరీగోడలు డిజిటిల్ క్లాస్ రూంలు చంద్రబాబు నిర్మించారు. అన్న ఎన్టీఆర్, చంద్రబాబు కలిసి లక్షా 75వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. జగన్ పదేపదే పేదలకు-ధనవంతులకు

(మిగతా 2లో)

## జివిఎంసి అభివృద్ధి పనులకు స్థాయి సంఘం ఆమోదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయి సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘంలో 136 అజెండాలతోపాటు 51 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 187 అంశాలు పొందుపరిచారని వీటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించి ఆమోదించారని తెలిపారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపు, గుత్తలు, ఆశీలు వసూలకు సంబంధించి, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి పలు ప్రాంతాలలో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపుకు రూ.12.30 లక్షలు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు వార్డులలో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు జెసిబిలతో వ్యర్థాలు తొలగింపు కొరకు రూ 2.23 కోట్లు, అలాగే ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.47.41 కోట్ల తో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం

(మిగతా 2లో)

## రాజశ్యామల యాగంలో పాల్గొనున్న సీఎం జగన్

### విశాఖ శ్రీ శారదా పీఠంలో ఏర్పాట్లు పూర్తి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం విశాఖ శారదాపీఠం అంగ రంగ వైభవంగా నిర్వహిస్తున్న రాజ శ్యామల యాగంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి జగన్ ఉదయం 11.40 గంటలకు పీఠానికి చేరుకుని సంప్రదాయ వస్త్రధారణతో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని ఆతర్వాత పీఠార్చనలో పాల్గొంటారు. పీఠ ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆలయాలను సందర్శిస్తారు. అనంతరం యాగశాలలో జరుగుతున్న రాజశ్యామల యాగం పూర్ణహుతిలో పాల్గొంటారు. తర్వాత పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకుని తిరిగి పయనమవుతారు.

శారదా పీఠంలో ముఖ్యమంత్రి

(మిగతా 2లో)

## లోకేష్‌కు పప్పు కుండ రిటన్ గిఫ్ట్ ఇచ్చిన మంత్రి అమర్నాథ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** తన తప్పులు తాను తెలుసుకోకుండా, తన తండ్రి రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని గురించి చేసిన అన్యాయం గురించి ఆలోచించకుండా, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు తెలుసుకోకుండా తనపైన, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కుటుంబంపైన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేష్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం అనకాపల్లి లో జరిగిన టిడిపి శంఖారావం సభలో లోకేష్, మంత్రి అమర్నాథ్‌కు కోడిగుడ్డు గిఫ్టుగా ఇస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్రంగా స్పందించిన మంత్రి అమర్నాథ్ లోకేష్‌కు మట్టికుండలో ముద్ద పప్పు వండి లోకేష్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు. దీనిని లోకేష్‌కి పంపిస్తామని ఆయన వచ్చిన ఆయన వచ్చి తీసుకున్నా అభ్యంతరం లేదని మంత్రి చెప్పుకొచ్చారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లోకేష్ కోసం సిద్ధం చేసిన ముద్దపప్పు కుండను మంత్రి అమర్నాథ్ ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గిఫ్ట్ ఇస్తే రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటం ఉత్తరాంధ్ర ప్రజల సంప్రదాయమని, మింది గ్రామంలోని కుమ్మరులు మట్టికుండలో లోకేష్‌కు ఇష్టమైన ముద్దపప్పును తయారుచేసి ఆయనకు పంపిస్తున్నామని చెప్పారు. ఉత్తరాంధ్రను ఏమాత్రం అభివృద్ధి చేయకుండా వదిలేసిన ఈ తండ్రి కొడుకులు సిగ్గు, లజ్జ లేకుండా ఈ ప్రాంతానికి వచ్చి తమపై విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందని, వారికి సిగ్గు వచ్చేందుకే ఈ పప్పులో ఉప్పు, కారం కలిపామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. తాను ఈ రాష్ట్రం పరువు తీశానని, మంత్రిగా ఏమీ సాధించ లేదంటూ లోకేష్ చేసిన వ్యాఖ్యలను అమర్నాథ్ తీవ్రంగా తిప్పి కొట్టారు. లోకేష్ వాళ్ళ నాన్న చంద్రబాబు తమ కింద ఉన్న మచ్చలు చూసుకోకుండా తమను తమ పార్టీని విమర్శిస్తున్నారని, తను లోకేష్ లా బ్యాక్ డోర్ పొలిటిషన్ ను కాదని, ఆయన మంత్రి అయ్యాక ఎమ్మెల్సీ అయ్యాడని, ఆ తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడని తాను ఎమ్మెల్యే అయ్యాక మంత్రిని అయ్యానని, తనకు, లోకేష్ కు పోలిక ఏంటని అమర్నాథ్ ప్రశ్నించారు.

(మిగతా 2లో)

## పారిశుద్ధ్యం, సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖ నగర పర్యటన సందర్భంగా పారిశుధ్యం, సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి విశాఖ నగరానికి విచ్చేయుచున్న సందర్భంగా ఎన్టీఆర్ జంక్షన్ నుండి చిన్న ముసిడివాడ శారద పీఠం వరకు పారిశుద్ధ్య పనులను, సుందరీకరణ పనులను అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ తో కలిసి పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పారిశుద్ధ్యం, సుందరీకరణ పనులతో పాటు రోడ్లు మరమ్మత్తులు పనులు, ఆకర్షణీయమైన మొక్కలతో సెంటర్ మీడియన్‌లను

(మిగతా 2లో)

## ఘనంగా ప్రారంభమైన శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రతిష్ఠా శతజయంత్యోత్సవాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పర్వదినాన 100 సంవత్సరంలో ప్రవేశిస్తున్న శుభ సందర్భంగా అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రేజేటి రామాచార్యులు వారి ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా 108 మంది మహిళలచే 108 కళాశాలతో శోభాయాత్ర ఆలయ వద్ద నుండి ప్రారంభమైంది. మెయిన్ రోడ్డు, పెరుగు బజార్ జంక్షన్, చిన్న వీధి, మల్లవరపు వారి వీధి మెయిన్ రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. అడుగడుగునా అమ్మవారికి భక్తులు హారతిలిచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చిన్న వీధి రామాలయం వద్ద ఎదురు సన్నాహ కార్యక్రమం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీవార్ల కళ్యాణ మహోత్సవాలు ఆలయ మండపంలో మాఘశుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీ వింద్య వాసిని దేవి శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ కోన కమలాదేవి శ్రీ జనార్ధన స్వామి వారి కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతిష్ట శత జయంతి ఉత్సవముల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ ఉద్యోగి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన నగర మేయర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దేందుకు, విద్యార్థులలో మంచి ప్రవర్తన, నడవడిక, పెద్దలపై విధేయత కలిగి ఉండేందుకు మంచి పుస్తకాలు, రచనలు అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు.

మంగళవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో జీవీఎంసీ బాల్యం విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మోహన్ కుమార్ అవుపాటి రచించిన "ఎన్సురింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఎర్లీ ఎడ్యుకేషన్" అనే పుస్తకాన్ని ఆమె చేతుల మీదగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విద్యార్థులలో విద్యతో పాటు మంచి నడవడిక కలిగి ఉండే రచనలు, పుస్తకాలు అవసరమని అన్నారు. జీవీఎంసీ బాల్యం విభాగంలో ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేయు చున్న మోహన్ కుమార్ అవుపాటి తమ పరిశోధన అధ్యయ నంలో భాగంగా రచించిన "ఎన్సురింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఎర్లీ ఎడ్యుకేషన్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగిందని, ఈ పుస్తకం ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నెంబర్ పొంది, తద్వారా "పెన్స్ అఫ్ హానర్" అవార్డు పొందడం జరిగిందని ఆమె తెలిపారు. ఇటువంటి మంచి రచనలు విద్యార్థులకు ఉపయోగపడేలా మరిన్ని రచనలు రచించి అందించాలన్నారు. ఇటువంటి మంచి పుస్తకాన్ని రచించిన మోహన్ కుమార్‌ను మేయర్ అభినందిస్తూ జ్ఞాపికను అందించారు.

| పంచాంగం | బుధవారం 21-02-2024<br>శోభకృత్ నామ సంవత్సరము<br>ఉత్తరాయణం ,శిశిర ఋతువు<br>మాఘ మాసం |
|---|---|
| తిథి | : ప. ద్వాదశి ప. 12.38 |
| నక్షత్రం | : పునర్వసు ప. 03.30 |
| వర్జ్యం | : రా. 12.03 ల 01.44 |

## ప్రత్యేక హోదా ఏమైంది?




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నన్ను అధికారంలో తీసుకువస్తే ఏపీ ప్రత్యేక హోదా, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు అమలకు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలు వంచి సాధిస్తానన్నా హామి ఏమైందని ప్రశ్నించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక సొంత ప్రయోజనల కోసం ఇచ్చిన హామిలు ప్రక్కన పెట్టి లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారని అన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని హమిచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం పనిచేయకపోగా ప్రశ్నించే కమ్యూనిస్టులను, ప్రజాసంఘాల గొంతుకను అణిచివేస్తు దుర్మార్గపు పాలనను పాలిస్తున్నారనీ తెలిపారు. రేపు జగన్మోహన్ రెడ్డి విశాఖ వస్తున్నా సందర్భంగా మేము ఒకటే సూటిగా అడుగుతున్నాం ఏనాడైనా విశాఖ స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూసారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల నమ్మించి మోసం చేసి వారి జీవితాలతో చదరంగం ఆడిన ముఖ్యమంత్రిని రాజకీయ నిరుద్యోగి చేయటమే అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) లక్ష్యం దిశగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు, సాయి పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో ఆరోగ్య వెలుగులు నింపడమే లక్ష్యం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ తెలిపారు. మంగళవారం నాడు మండలంలో పి.ఎన్. ఆర్ పేట సచివాలయ పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఓ అప్పలనాయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ దేశంలోని ఎక్కడా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టలేదని, సీఎం జగన్మోహన్ రెడ్డికి పేదలంటే ఇష్టం కాబట్టే ఇంతటి మంచి కార్యక్రమం సాధ్యమైందని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి వైద్యుల సూచనల మేరకు వైద్య కిట్లను వారు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యసచివాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మండల వైసీపీ సీనియర్ నాయకులు సేనాపతి రాము, గొన్నాబత్తుల శివ, శేఖర్, అప్పలనాయుడు, గోవింద, తదితర నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# (మొదటి పేజీ తరువాయిలు)

### అందుకే ఆర్టికల్ 370ని రద్దు చేశాం

జమ్మూ కాశ్మీర్‌లో కొత్తగా రిక్రూట్ అయిన సుమారు 1,500 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు. 'వికసిత్ భారత్, వికసిత్ జమ్మూ' కార్యక్రమంలో భాగంగా వివిధ పథకాల లబ్ధిదారులతో కూడా సంభాషించారు.

మోదీ ప్రారంభించిన రైల్వే ప్రాజెక్టులలో బనిహాల్-ఖరీ-సంబర్-సంగల్దాన్ (48 కి.మీ) మధ్య రైల్వే లైన్, కొత్తగా విద్యుద్దీకరించిన బారాముల్లా-శ్రీనగర్-బనిహాల్-సంగల్దన్ సెక్షన్ (185.66 కి.మీ) ఉన్నాయి. లోయలో తొలి ఎలక్ట్రిక్ రైలును, సంగల్దాన్, బారాముల్లా స్టేషన్ల మధ్య రైలు సర్వీసును ఆయన పచ్చాజెండా ఊపి ప్రారంభించారు. బనిహాల్-ఖరీ-సంబర్-సంగల్దాన్ సెక్షన్‌ను ప్రారంభించడం చాలా ముఖ్యమైనది. ఇది ప్రయాణీకులకు మెరుగైన రైడ్ అనుభూతిని అందించే మార్గం పొడవునా బ్యాలస్ట్ లెస్ ట్రాక్ వినియోగాన్ని కలిగి ఉంటుంది.

భారతదేశం పొడవైన రవాణా సొరంగం T-50 (12.77 కిమీ) ఖరీ, సుంబెర్ మధ్య భాగంలో ఉంది. రైల్వే ప్రాజెక్టులు కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని, పర్యావరణ సుస్థిరతను నిర్ధారించడానికి, ప్రాంతం యొక్క మొత్తం ఆర్థిక అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల కోసం దాదాపు రూ.13,500 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టలలో IIT భిలాయ్, IIT తిరుపతి, IIT జమ్మూ, IIITDM కాంచీపురం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, అగర్తల (త్రిపుర), కాన్పూర్‌లో ఉన్న అధునాతన సాంకేతికతలపై మార్గదర్శక నైపుణ్యాల శిక్షణా సంస్థ, దేవప్రయాగ్ (ఉత్తరాఖండ్)లోని సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయ క్యాంపస్‌లు ఉన్నాయి. దేశంలోని మూడు కొత్త ఐఐఎంలు.. ఐఐఎం జమ్ము, ఐఐఎం బోధ్ గయా, ఐఐఎం విశాఖపట్నం, కేంద్రీయ విద్యాలయాలకు (కెవిలు) 20 కొత్త భవనాలు, దేశవ్యాప్తంగా కొత్త జవహర్ నవోదయ విద్యాలయాలు (జెఎన్‌వి) భవనాల కోసం 13 కొత్త భవనాలను కూడా ఆయన ప్రారంభించారు. జమ్మూ కాశ్మీర్ ప్రజలకు సమగ్రమైన, నాణ్యమైన, సంపూర్ణమైన తృతీయ-సంరక్షణ ఆరోగ్య సేవలను అందించడానికి తన ప్రభుత్వ ప్రయత్నాలలో భాగంగా, ప్రధాని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విజయపూర్ (సాంబా), జమ్మూ భవనాలను కూడా ప్రారంభించారు.

ఫిబ్రవరి 2019లో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ 'ప్రధాన్ మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన' కింద స్థాపించారు. 1,660 కోట్ల వ్యయంతో 227 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఆసుపత్రిలో 720 పడకలు, 125 సీట్లతో మెడికల్ కాలేజీ, 60 సీట్లతో నర్సింగ్ కాలేజీ, 30 పడకలతో ఆయుష్ బ్లాక్, రెసిడెన్షియల్ అకామిడేషన్ ఉన్నాయి. అధ్యాపకులు, సిబ్బందికి, UG, PG విద్యార్థులకు హాస్టల్ వసతి, ఇతర సౌకర్యాలతో పాటు షాపింగ్ కాంప్లెక్స్, ఇతర ప్రాజెక్టులతో పాటు జమ్మూ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనానికి మోదీ శంకుస్థాపన చేశారు. 40,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, కొత్త టెర్మినల్ భవనంలో రద్దీ సమయాల్లో సుమారు 2,000 మంది ప్రయాణికులకు సేవలు అందించే ఆధునిక సౌకర్యాలు ఉంటాయి. ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వే రెండు స్ట్రెచ్‌లు (44.22 కి.మీ) జమ్మూని కత్రాకు కలిపే, శ్రీనగర్ రింగ్ రోడ్డు నాలుగు-లేనింగ్ కోసం దశ-రెండవ దశలతో సహా ముఖ్యమైన రహదారి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. జమ్మూలో CUF (కామన్ యూజర్ ఫెసిలిటీ) పెట్రోలియం డిపోను అభివృద్ధి చేసే ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేశారు.

### ఆ పథకాల కింద నిధులను విడుదల చేసిన వైఎస్ జగన్

ఫలితంగా 10వ తరగతిలోపే చదువును ఆపివేయాలనుకునే వారందరూ గ్రాడ్యుయేట్స్ అయ్యేలా అడుగులు వేయిస్తున్నామని జగన్ పేర్కొన్నారు.

తల్లిదండ్రులు విద్యాధికులై ఉంటే వారి పిల్లలు కూడా చదువుల బాట పడతారని, ఇది నవ సమాజాన్ని నిర్మిస్తుందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో ఏదో ఇచ్చామంటే ఇచ్చామనే పరిస్థితి కాకుండా ప్రతి త్రైమాసికం పూర్తయిన వెంటనే నూతన జంటల కుటుంబానికి నగదు సాయం విడుదల చేస్తున్నామని గుర్తు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వరకు వెళ్లే అవకాశం లేకుండా నేరుగా గ్రామ/వార్డు సచివాలయాల్లోనే మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చేలా మార్పు చేశామని జగన్ అన్నారు. ఎస్సీలకు గత ప్రభుత్వం ఇస్తామన్న సాయం 40,000 రూపాయలేనని, ఇప్పుడు తమ ప్రభుత్వం ఈ మొత్తాన్ని లక్ష రూపాయలకు పెంచిందని చెప్పారు.

గత ప్రభుత్వం 17,709 మంది జంటలకు అరకొరగా ఆర్థిక సహాయం చేసేదని, పైగా 70 కోట్ల రూపాయలను ఎగ్గొట్టిందని జగన్ చెప్పారు. తాము అర్హులైన ప్రతి జంటకూ, ప్రతి త్రైమాసికం అయిపోయిన వెంటనే సాయం అందిస్తున్నామని అన్నారు. ఈ పథకం వల్ల అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానంటూ నూతన వధూవరులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

### మరోసారి కోడికత్తి కేసు విచారణ వాయిదా

ఈ కేసులో లోతైన విచారణ జరగాలంటూ సీఎం జగన్ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై పోరాడాతామని తెలిపారు. ఎన్నికలకు ముందే ఈ కేసు క్లోజ్ అయ్యేలా ప్రయత్నం చేస్తామన్నారు. సీఎం వాంగ్మూలం ఇస్తే ఈ కేసు 90% క్లోజ్ అవుతుందని చెప్పుకొచ్చారు. ఈ కేసులో నీళ్లు ఏవో పాలు ఏవో తేలుస్తామని లాయర్ సలీమ్ పేర్కొన్నారు.

**ప్రతిసారి ఓదో ఒక సాకు చెబుతూ...: బూసి వెంకటరావు**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిసారి ఏదో ఒక వాదం చెప్పి కోర్టుకు హాజరుకావడం లేదని దళిత ఐక్యవేదిక బూసి వెంకటరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి కోరినటువంటి అత్యున్నత విచారణ సంస్థ ఎన్ఐఏ కూడా కుట్ర కోణం లేదని చెప్పిందన్నారు. ఇంకా ఎందుకు వాదనలు కొనసాగిస్తుందో అర్థం కావడం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డిని కాపాడటం కోసం చేస్తున్నారేమో అని అనుమానంగా ఉందన్నారు. ఈ కేసు నుంచి ఎన్ఐఏ దర్యాప్తు పూర్తయింది కాబట్టి వైదొలగాలని కోరుతున్నామని బూసి వెంకటరావు అన్నారు.

### వైసిపి పాలనలో రాష్ట్రం గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియా గా మారింది

యుద్ధం అంటున్నారు. లక్ష కోట్లు అక్రమంగా సంపాదించినవాడు పేదవాడా? లక్ష రూపాయలు విలువైన చెప్పులు, వెయ్యి ఖరీదైన వాటర్ బాటిల్ తాగేవాడు పేదవాడే? జగన్ ది అతి ఖరీదైన వాచ్ వేసుకుని తిరిగే పేదవాడు. భారతి సిమెంట్స్, సండూర్ పవర్ ప్లాంట్లు ఉన్న పేదవాడే? నిజమే జగన్ సాక్షి టీవీ, పేపర్ ఉన్న పేదవాడే. జగన్ నిజం చెబితే తల వెయ్యి వక్కలు అవుతుంది. జరగబోయే ఎన్నికలు జగన్ అహంకారానికి, ప్రజల ఆత్మగౌరవాని మధ్య యుద్ధం. లోకేష్ ను చూస్తే జగన్ కు భయం. పాదయాత్ర చేయకుండా జీవో 1 తీసుకువచ్చారు. అనేక ఇబ్బందులు పెట్టారు. మైక్, స్టూల్ లాక్కున్నారు. బండి ఎక్కితే అది కూడా లాక్కున్నారు. ఇప్పుడు ఎర్రబుక్ పైనా కేసులు పెడుతున్నారు. నాది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం. నీది రాజా రెడ్డి రాజ్యాంగం. మొదట హామీ ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. అప్పటివరకు 3వేల నిరుద్యోగ భృతి ఇస్తాం. స్కూల్ కు వెళ్లే ప్రతి విద్యార్థి అకౌంట్‌లో రూ.15వేలు వేస్తాం. ఒక్కరుంటే రూ.15వేలు, ఇద్దరుంటే రూ.30వేలు, ముగ్గురుంటే ఏడాదికి రూ.45 వేలు వేస్తాం.

ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తాం. ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతోంది మన ప్రభుత్వం.

18 నుంచి 59 సంవత్సరాలు వయసున్న మహిళలకు ప్రతి నెల రూ.1,500 ఇస్తాం, సంవత్సరానికి రూ.18వేలు, ఐదు సంవత్సరాలకు రూ.90 వేలు మన ప్రభుత్వం ఇవ్వబోతోంది. ఆరో హామీ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ చేసే హక్కు కూడా కల్పించబోతున్నాం.

గత ఐదేళ్లలో ఒక్క రోడ్డు వేయలేదు, గుంత పూడ్చలేదు. ఉపముఖ్యమంత్రి అంటే ఎవరైనా పలుకుతారు. కానీ ఈయన అవినీతి కోసం ఫోన్లు చేస్తారు. అభివృద్ధి నిల్, అవినీతి ఫుల్.

15 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేసిన వ్యక్తి చంద్రబాబు. ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారు. 53 రోజులు రాజమండ్రి జైలులు నిర్బంధించారు. నాకు ఆనాడు మొదట ఫోన్ చేసిన వ్యక్తి పవనన్న. నాకు అండగా నిలబడతానని చెప్పారు.

పవన్ ప్రత్యేక విమానంలో ఆంధ్రా రావాలంటే ఈ ప్రభుత్వం పర్మిషన్ క్యాన్సిల్ చేసింది. రోడ్డు మార్గంలో రావాలంటే బోర్డర్‌లో 3 గంటలు నిలిపివేశారు. ఈ శంఖారావం కార్యక్రమం ద్వారా బాబు సూపర్- 6 హామీలు ప్రతి గడపకు తీసుకెళ్లాలి. గతంలో బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలు చేశాం. బాబు ష్యూరిటీ-భవిష్యత్ కు గ్యారెంటీ టెక్నాలజీతో కూడిన కార్యక్రమం మనం చేశాం. ఎవరు బాగా పనిచేశారో నాకు తెలుస్తుంది. బాగా పనిచేసిన వారికి ఉత్తమ కార్యకర్త అవార్డులు ఇచ్చాం. వారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసుకున్నాం. బాబు సూపర్-6 కార్యక్రమాలు కూడా బాగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కార్యకర్తలు నా చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ తిరగాలి. వారిని వెతుక్కుంటూ వచ్చి నామినేటెడ్ పదవులు ఇస్తాం. అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### జివిఎంసి అభివృద్ధి పనులకు స్థాయి సంఘం ఆమోదం

తెలిపిందన్నారు.

ఈ సమావేశంలో స్థాయి సంఘం సభ్యులతో పాటు పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి(ఆర్) ఎస్.శ్రీనివాస్, జోనల్ కమీషనర్లు కె.కనక మహాలక్ష్మి, విజయలక్ష్మి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాజశ్యామల యాగంలో పాల్గొనున్న సీఎం జగన్

పర్యటన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం మున్సిపల్ కమీషనర్ పి. సాయికాంత్ వర్మ, పోలీసు అధికారులు పీఠ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించారు. విమానాశ్రయం నుంచి పీఠం వరకూ పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు.

### లోకేష్‌కు పప్పు కుండ రిటన్ గిఫ్ట్ ఇచ్చిన మంత్రి అమర్నాథ్

45 సంవత్సరాల రాజకీయ చరిత్ర మా కుటుంబానికి ఉంది. నా తాత, తండ్రి దగ్గర నుంచి నా కుటుంబమంతా మింది గ్రామంలోనే మా తాత కట్టిన ఇంట్లోనే ఉంటోందని మంత్రి అమర్నాథ్ చెప్పారు. లోకేష్ ఎక్కడ పుట్టాడు? వాళ్ళ నాన్న ఎక్కడ పుట్టాడు? ప్రస్తుతం ఆయన ఉంటున్నది ఎక్కడ? చంద్రబాబు నాయుడు సంపాదించిన అక్రమార్జనతో నిర్మించిన ప్యాలెస్‌లో లోకేష్ ఉంటున్నాడు. మీరు చేసిన అవినీతి, అక్రమాలు, అన్యాయాలను గురించి మర్చిపోయి మాపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. అనకాపల్లిలో జరిగే అభివృద్ధి గురించి మాట్లాడకుండా, 420 గాళ్లను, గంజాయి డాన్లను, వైజాగ్ వీరప్పన్ లను పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడకుండా, జరిగిన అభివృద్ధి గురించి తెలుసుకోవాలని సూచించారు. అనకాపల్లిని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేసింది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం. ఈ విషయం లోకేష్ పక్కన కూర్చున్న బంట్రోతులకు తెలియదా? అని అమర్నాథ్ ప్రశ్నించారు. నీ తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నీ పక్కన కూర్చున్న ఒక వ్యక్తిపై 420 కేసు పెట్టిన విషయం నీకు తెలుసా? అని లోకేషన్ అమర్నాథ్ ప్రశ్నించారు.

ఇక తాను అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నానని, విస్సన్నపేట భూములను ఆక్రమించుకున్నానని లోకేష్ చేసిన వ్యాఖ్యలను మంత్రి అమర్నాథ్ తీవ్రంగా ఖండించారు. విస్సన్నపేటలో ఒక్క సెంటు భూమైన నా పేరున ఉంటే రాజకీయాలను వదులుకుంటారని అమర్నాథ్ సవాల్ విసిరారు. విస్సన్నపేట భూముల విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ పవన్ కళ్యాణ్ వెళ్లి రోజంతా అక్కడే ఉండి ఏం సాధించారని అమర్నాథ్ ప్రశ్నించారు.

14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఏనాడైనా ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోర్టు నిర్మించాలని భావించారా? తాను మంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా మూలపేట పోర్టుకు శంకుస్థాపన విషయం ఈ పప్పు ముద్దకి తెలియకపోవడం దురదృష్టకరం అని అమర్నాథ్ హెచ్చరించారు. ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, ఎకెహెూమా టైర్ల కంపెనీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్బులు ఏర్పాటు చేసిన ఘనత తమదేనని ఈ నోరు తిరగని నాయకుడికి తెలుసా? అని అమర్నాథ్ ప్రశ్నించారు. అంతేకాదు ప్రతి కంపెనీలో స్థానికంగా ఉన్నవారికి 75% ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అని, మీ హయాంలో ఎప్పుడైనా ఇటువంటి ఆలోచన చేశారా? అని ఆయన ప్రశ్నించారు. లోకేష్ ఐ.టీ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 900 కోట్ల రూపాయల ఐ.టి ఎగుమతులు జరిగితే తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రం నుంచి 2500 కోట్ల రూపాయల ఐ.టి ఎగుమతులు జరిగాయని అమర్నాథ్ స్పష్టం చేశారు. విశాఖలో ఇన్ఫోసిస్ తో సహా 250 ఐటి కంపెనీలను నెలకొల్పామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. 2017లో లోకేష్ విశాఖలో మాట్లాడుతూ విశాఖలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు లేవని చెప్పిన విషయాన్ని మంత్రి అమర్నాథ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై లోకేష్ చేసిన వ్యాఖ్యలను అమర్నాథ్ తీవ్రంగా పరిగణించారు. జగన్మోహన్ రెడ్డి తన కుటుంబ సభ్యులను చూసుకోవడం లేదంటూ లోకేష్ చేసిన వ్యాఖ్యలపై అమలా స్పందిస్తూ.. ఎన్టీఆర్ నీ తండ్రి చంద్రబాబు నాయుడు గురించి ఏమన్నారో తెలుసా? లక్ష్మీపార్వతి, హరికృష్ణ నీతండ్రిపై చేసిన వ్యాఖ్యల గురించి నీకు తెలుసా ?దగ్గుబాటి వెంకటేశ్వరరావు తను రాసిన పుస్తకంలో మీ నాన్న గురించి ఏం రాశారో నీకు తెలుసా? అంతెందుకు నువ్వు ఎంతగానో ప్రేమిస్తున్న పవన్ కళ్యాణ్ మీ నాన్న గురించి ఏం చెప్పారో గుర్తుందా? ? ఇవేవీ తెలుసుకోకుండా జగన్మోహన్ రెడ్డి గురించి మాట్లాడటం సరికాదని మంత్రి అమర్నాథ్, లోకేష్ ను హెచ్చరించారు. పురందరేశ్వరిని కేంద్ర మంత్రిగా చేసిన ఘనత రాజశేఖర్ రెడ్డిది అన్న విషయాన్ని లోకేష్ గుర్తించాలని అమర్నాథ్ సూచించారు.

అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరించేందుకు లోకేష్, చంద్రబాబు నాయుడు బృందం చేస్తున్న కుయుక్తులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఇప్పటికైనా నోరు దగ్గర పట్టుకుని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి అమర్నాథ్ హెచ్చరించారు.

### పారిశుద్ధ్యం, సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయండి

ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, వీధి దీపాల నిర్వహణ, ఫుట్ పాత్‌లు, పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ కుమార్, ఎస్.ఇ రామ మోహన్ రావు, జోనల్ కమీషనర్ హేమావతి, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరరావు పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

బుధవారం 21-02-2024


## ప్రదోషం అంటే ఏమిటి?

ప్రదోషం అంటే పాపాలను తొలగించడం. త్రయోదశి నాడు సాయంత్రం ప్రదోష సమయం శివుడిని ప్రార్థించడానికి మరియు అతని ఆశీర్వాదాలను కోరడానికి అనుకూలమైనది. ప్రదోష దినం పార్వతీ దేవితో పాటు పరమశివుడు చాలా సంతోషంగా, ఆనందంగా మరియు ఉదారంగా ఉండే రోజులలో ఒకటిగా నమ్ముతారు. ప్రస్తుత జీవితంలో మన సామర్థ్యాన్ని పరిమితం చేసే కర్మ లేదా కర్మ శక్తులను తొలగించడానికి ఈ సమయాలు అనుకూలమైనవి.

ప్రదోష రోజున శివుడిని పూజించడం వల్ల పాపాలు తొలగిపోయి మోక్షప్రాప్తి కలుగుతుందని నమ్మకం. శివభక్తులు చేసే పూజలన్నింటిలో ప్రదోష పూజ అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ప్రదోష కాలంలో అన్ని విశ్వమానవులు మరియు దేవతలు భూమిపైకి వచ్చి పూజలకు హాజరవుతారని నమ్ముతారు. ప్రదోష ఆచరించడం యొక్క ప్రాముఖ్యతను శివ పురాణం నుండి ప్రదోష మహాత్మ్యంలో పేర్కొనబడింది. అందుకే శివ భక్తులు ప్రదోష పూజను పవిత్రంగా ఆచరిస్తారు. ఈ ద్వైమాసిక వ్యవహారం సూర్యుడు మరియు చంద్రుడు వారి అక్షం మీద వారి కదలిక సమయంలో క్షితిజ సమాంతర రేఖలో కలవడాన్ని సూచిస్తుంది.

ప్రదోష వ్రతం అనేది పరమశివుని పేరు మీద పాటించే ఉపవాసం, పరమశివుడు విశ్వానికి రక్షకునిగా వ్యవహరిస్తాడు. ఇది శుక్ల పక్షం (ప్రకాశవంతమైన సగం) మరియు కృష్ణ పక్షం (చీకటి సగం) రెండింటి సంధ్యాకాల సమయంలో గమనించబడుతుంది.

**ప్రదోష వ్రతం యొక్క అర్థం**

ప్రదోషం అంటే సంధ్యా సమయం. ప్రదోషం పవిత్రమైన 3 గంటల వ్యవధిని సూచిస్తుంది. ఈ 3 గంటల సమయాన్ని సూర్యాస్తమయానికి 1.5 గంటల ముందు మరియు సూర్యాస్తమయానికి 1.5 గంటల తర్వాత రెండు భాగాలుగా విభజించారు. వ్రతం లేదా ఉపవాసం అంటే సంయమనం పాటించడం లేదా కొన్ని ఆహార పదార్థాలు మరియు పానీయాలను తగ్గించడం. అందువల్ల, ప్రదోష వ్రతం అంటే సంధ్యా సమయంలో సాధారణ ఆహారం నుండి దూరంగా ఉండటం.

**ప్రదోష వ్రతం యొక్క రకాలు & ప్రయోజనాలు**

ప్రదోష వ్రతం సంభవించే రోజులను బట్టి దాని స్వంత ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఈ ప్రదోషాలను రోజుల ప్రకారం ఈ క్రింది విధంగా పిలుస్తారు:

**సోమ ప్రదోషం** : ప్రదోష వ్రతం సోమవారం నాడు వస్తే, దానిని సోమ ప్రదోషం అంటారు. ప్రదోష వ్రతం సోమవారం రోజున వస్తే, శివ భక్తుల కోరికలన్నీ నెరవేరుతాయి మరియు అతను/ఆమె సానుకూల ఆలోచనాపరులు అవుతారు.

**భౌమ ప్రదోషం** : ప్రదోష వ్రతం మంగళవారం నాడు వస్తే దానిని భౌమ ప్రదోషం అంటారు. భౌమ ప్రదోష వ్రతం యొక్క ప్రయోజనం ఏమిటంటే ఇది ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం ఇస్తుంది మరియు శారీరక ఆరోగ్యాన్ని పెంచుతుంది. ఇది శ్రేయస్సును కూడా తెస్తుంది.

**సౌమ్య వార ప్రదోషం** : ప్రదోష వ్రతం బుధవారం నాడు వస్తే దానిని సౌమ్య వార ప్రదోషం అంటారు. ప్రదోష వ్రతం యొక్క ఈ రోజు విద్య, జ్ఞానం, కోరికల నెరవేర్పు మరియు సంతానం కలిగిన వ్యక్తికి ప్రయోజనం చేకూరుస్తుంది.

**గురువార ప్రదోషం** : ప్రదోష వ్రతం గురువారం నాడు వస్తే దానిని గురు వార ప్రదోషం అంటారు. ఈ రోజున, పూర్వీకుల నుండి లేదా పితృ నుండి దైవిక ఆశీర్వాదాలు లభిస్తాయి. ఈ రోజున ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఉన్న అన్ని ఆపదలు తొలగిపోతాయి.

**భృగువార ప్రదోషం** : ప్రదోష వ్రతం శుక్రవారం నాడు వస్తే దానిని భృగు వార ప్రదోషం అంటారు. ఈ ప్రదోష వ్రతం అన్ని ప్రతికూలతలను మరియు వ్యతిరేకతను తొలగించి విజయం మరియు సంతోషాన్ని కలిగిస్తుంది.

**శని ప్రదోషం** : ప్రదోష వ్రతం శనివారం నాడు వస్తే దానిని శని ప్రదోషం అంటారు. శని ప్రదోష వ్రతం యొక్క ప్రయోజనం అది ప్రమోషన్ తెస్తుంది మరియు శని ప్రదోష వ్రతం ఆచరిస్తే కోల్పోయిన సంపదలు అందుతాయి.

**భాను వార ప్రదోషం** : ప్రదోష వ్రతం ఆదివారం నాడు వస్తే దానిని భాను వార ప్రదోషం అంటారు. ఈ రోజున ప్రదోష వ్రతం భక్తులు ఆచరిస్తే, శాంతి మరియు ఆయురారోగ్యాలు కలుగుతాయి.

**ప్రదోష వ్రతం యొక్క ప్రాముఖ్యత**

శివ పురాణం ప్రకారం, ఆరోగ్యం, సంపద మరియు సంతానం పొందేందుకు ప్రదోష వ్రతం అత్యంత ప్రయోజనకరమైన ఉపవాసంగా పరిగణించబడుతుంది. ప్రదోష వ్రతం భక్తులను గత మరియు ప్రస్తుత పాపాల నుండి విముక్తి చేస్తుంది. ప్రదోషాన్ని పూర్తి భక్తితో మరియు అంకితభావంతో ఆచరించడం ద్వారా, శివుడు మరియు పార్వతి ద్వారా అన్ని కోరికలు నెరవేరుతాయి. అందుకే, గత పాపాలన్నింటినీ పోగొట్టుకుని, శివుని అనుగ్రహాన్ని పొందాలనుకునే భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు.

## సమత కళాశాలలో దిశ మొదలైంది



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం సమత కళాశాలలో దిశ మొదలైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల డీన్ విజయ్‌చంద్ర, సెక్రటరీ రవీంద్ర, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ మాధవి లత, రమేష్, కోటి, పద్మజ, దేవికా, వ్యాయామ విభాగ అధిపతి జి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా అడవి రాజబాబుల పండగ



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** అడవి రాజుబాబుల పర్వదినాన్ని స్థానిక నెయ్యల వీధి వాసులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గడచిన కొన్నేళ్లుగా సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ పర్వదినం కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక నెయ్యిల వీధి అధ్యక్ష కార్యదర్శులు ఇంటి యేసు, ఆబోతు కొండబాబు లా ఆధ్వర్యంలో ఆ కుల పెద్ద పి కామేశ్వరరావు సమక్షంలో జోడు మామిళ్ళ వృక్షాల చెంత ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పూజాదికాలు నిర్వహించి ఈ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి కుల మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో భక్తులు, అభిమానులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆ కుల సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కల్వర్టును ఢీకొన్న ఘటనలో బైకిస్ట్ మృతి



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** పట్టణ పరిధిలో గల పెంజెరువు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు.ఈ ఘటనపై పట్టణ ఎస్సై కె.పాపినాయుడు తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి గాంధీనగర్ కి చెందిన ఇరుగుల ప్రసాద్ అనే యువకుడు ఎస్.రాయవరం వైపు నుంచి బైకుపై యలమంచిలి వస్తుండగా బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టడంతో ప్రసాద్ కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు, మెడకు బలమైన గాయమై తీవ్ర రక్త స్రావమవ్వడాన్ని అటుగా వెళ్తున్న వారు గుర్తించి పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు వైద్య పరీక్ష చేసి ప్రసాద్ చనిపోయినట్టు నిర్ధారించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుని సోదరుడు ఇరుగుల రామ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## దేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉపాధి అవకాశాలు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** దేశంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా అన్నివర్గాల ప్రజలుకు దేశంలో ఉపాధి లభిస్తుంది అని బీజేపీ గిరిజన మేధావులు రాష్ట్ర కన్వీనర్ కురుసా పార్వతమ్మ అన్నారు. మంగళవారం పాడేరు మండలం గొండెలీ పంచాయితీ లంపలి గ్రామం లో పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడుతూ ఉపాదిహమి పనిచేస్తున్నా వారితో ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని తెలిపారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు,

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తదితరుల కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇదేనా గిరిజన పిల్లలకు సేవ చేస్తున్న లక్షణం




**పాడేరు, (విశాఖ సమాచారమ్):** గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తీవ్రమైన హెచ్చరికలు చేసారు. ఇదేనా గిరిజన పిల్లలకు సేవ చేస్తున్న లక్షణమని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్ల పని తీసు మార్చుకోవాలని విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని అన్నారు. ఐటిడి ఏ సమావేశ మందిరంలో సహాయ గిరిజన సంక్షేమాధికారులు, గురుకులం ప్రిన్సిపాల్స్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లతో మంగళవారం ఆశ్రమ పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న ఆరోగ్య సేవల, ఇటీవల జరుగుతున్న విద్యార్థుల మరణాలపై మండలాల వారీగా సమీక్షించారు. విద్యార్థులకు జ్వరాలు సోకినా, అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల మరణాలపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మరణిస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసి ప్రభుత్వానికి సరెండరు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు మరణిస్తే వెంటనే డిడికి సమాచారం అందించాలని స్పష్టం చేసారు. విద్యార్థుల మరణాలపై డెత్ ఆడిట్ చేస్తామన్నారు. ప్రతీ చిన్న విషయానికి పోరాటాలు చేస్తారని విద్యార్థులు మరణాలపై ఎందుకు పోరాటాలు చేయడం లేదని నిలదీసారు. ప్రజలలో గిరిజన విద్యావ్యవస్థపై నమ్మకం పెరిగేలా పనిచేయాలని అన్నారు. సమాజంలో మనపై నమ్మకం దిగజారి పోతుందన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పటల్ (జిల్లా ఆసుపత్రి,పాడేరు) లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక వార్డు ఏర్పాటు చేయాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యార్థినీ విద్యార్థుల ఎక్కడ, ఎప్పుడు, ఎలా, మరణించారు? వ్యాధులు వచ్చినపుడు అందించిన వైద్య సేవలపై ఆరా తీసారు.

విద్యార్థులకు చర్మ వ్యాధుల నివారణకు రూ.5.50 లక్షల వ్యయంతో సబ్బులు పంపిణీ చేసామని అన్నారు. ఆశ్రమ పాఠశాలలు సందర్శించినపుడు సమస్యలను తన దృష్టికి తీసుకుని రావడం లేదని అన్నారు. కావలసిన వారిని డిప్యూటీ వార్డెన్‌గా నియమించండని హెచ్.ఎం.లు సిఫారుసులు చేస్తున్నారని అటువంటివి పునరావృతం జరిగితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రధానోపాధ్యాయుడి ఆదేశాలు, ఉపాధ్యాయులు తప్పకుండా పాటించాలని నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తన దృష్టికి తీసుకుని వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిప్యూటీ వార్డెన్ల మీద ఉన్న ఉత్సాహం పిల్లల ఆరోగ్యంపై లేదన్నారు. అటు వంటి సిఫారసులు చేస్తే సస్పెండ్ చేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ప్రధానోపాధ్యాలు సమన్వయం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వైద్యం అందించడానికి విద్యార్థులను తీసుకుని వస్తే వెంటనే ఉప సంచాలకులు, ఎటిడబ్ల్యూ ఓలకు సమాచారం అందించాలని అన్నారు. రెండు రోజులు జ్వరంతో విద్యార్థి బాధపడితే వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలని ఆదేశించారు.

సికిల్సెల్ ఎనిమియా, మానసిక వ్యాదులు వంటి వ్యాదులతో బాధపడే విద్యార్థుల ఆరోగ్యంపై పేరు పేరునా ఆరా తీసారు. హృదయ సంబంధిత వ్యాదులు, మానసిక రుగ్మతులతో బాధపడే విద్యార్థులను గుర్తిస్తే ప్రత్యేక వైద్యం అందిస్తామని డబ్బు సమస్య లేదని చెప్పారు. అవసరమైతే హార్ట్ ఆపరేషన్ చేయిస్తామన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించినా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పని చేయాలని స్పష్టం చేసారు. ప్రధానోపాధ్యాయులు సెలవు పెడితే పి ఓ అనుమతి తీసుకుని ప్రత్యామ్నాయంగా ఇన్చార్జి హెచ్.ఎం.ను నియమించాలని డిడిని ఆదేశించారు. ఉపాధ్యాయులు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తీరు మార్చుకోవాలని స్పష్టం చేసారు. ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు పట్ల తలిదండ్రులు అసభ్యంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. విద్యార్థుల హాజరు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై సరైన సమాదానాలు చెప్పలేదని కొయ్యూరు గిరిజన సంక్షేమ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. దేవ మూర్తి, హుకుంపేట బాలుర ఆశ్రమ పాఠశాల బాలురు-2 ప్రధానోపాధ్యాయుడు శోభా నాగభూషణం లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉపసంచాలకులను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులను నోడల్ అధికారులగా నియమిస్తూ సమావేశంలో ఉత్తర్వులు జారీ చేసారు. ఐటిడి ఏ లో ఏర్పాటు చేసిన హెల్ కాల్ సెంటర్ సేవలను వినియోగించు కోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. హెల్త్ కాల్ సెంటర్ ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండి అవసరమైన వెంటనే అంబులెన్సు సమకూర్చి ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తారని అన్నారు. 1800 4250 0004 నెంబరు కాల్ చేయాలన్నారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యలు సూచించినపుడు ప్రత్యేకంగా సిక్ రూం ఏర్పాటు చేయాలని ఇళ్లకు పంపించ కూడదన్నారు. తలిదండ్రులకు నాటు వైద్యం వాడకుండా అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ. కొండల రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా॥ సలీం భాషా, ఎటిడబ్ల్యూ ఓలు ఎల్.రజని, మల్లిఖార్జున రావు, వెంకట రమణ, క్రాంతి, 11 మండలాల ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్, డిప్యూటీ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.


రండి!! దర్శించండి!! తరించండి!!!

# శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరము

మొగిలిచెర్ల - నెల్లూరు జిల్లా



తేది : 24 - 02- 2024

శనివారం మాఘమాస పౌర్ణమితిథి నాడు

శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరము

మొగిలిచెర్ల

ఉ॥ గం॥9.00 నుండి

మధ్యాహ్నం గం॥12.45 నిమి॥ వరకు

## శ్రీలక్ష్మీనారాయణ హోమము

నిర్వహింపబడును.

ఈ హోమము నందు ప్రత్యక్షముగా మరియు

పరోక్షముగా పాల్గొనదలచిన భక్తులు

సంప్రదించవలసిన నెంబర్లు

9908973699 9948742865 6302616897

భక్తులెల్లరూ ఈ హోమములో పాల్గొని తరించగలరు.

# దోసకాయలు ఎక్కువగా తింటే కిడ్నీలకు మంచిదా



వేసవిలో చాలా మంది దోసకాయలు తింటారు. అదే విధంగా మూమూలు రోజుల్లోనూ వీటిని తింటూనే ఉంటారు. వీటిని తినడం వల్ల దాహం తీరుతుంది. ఆకలిగా అనిపించదు. కడుపులో చల్లగా ఉంటుంది. అందుకే వీటిని చాలా మంది ఇష్టంగా తింటారు. అయితే వీటి గురించి కొన్ని షాకింగ్ విషయాలు ఉన్నాయి.

**డీహైడ్రేషన్** : దోసకాయ గింజలు ఫైబర్‌కి మూలం. మూత్ర విసర్జన లక్షణాలను కలిగి ఉన్న కుకుర్బిటిన్ అనే సమ్మేళనం ఇందులో పుష్కలంగా ఉంటాయి. అయితే దోసకాయలో మూత్ర విసర్జన సమ్మేళన పరిమాణం తక్కువగా ఉంటుంది. కానీ, దోసకాయను ఎక్కువగా తీసుకుంటే అది శరీరంలోని నీటిని అధికంగా బయటకి పంపుతుంది. దీంతో డీహైడ్రేషన్ తలెత్తుతుంది.

**కిడ్నీలకు ప్రాబ్లమ్** : దోసకాయ పొటాషియానికి మంచి మూలం. ఇది రక్తపోటు సమస్యలను తగ్గిస్తుంది. కానీ, ఎక్కువగా తీసుకుంటే హైపర్ కలేమియా వంటి ఆరోగ్య సమస్యలకి కారణమవుతుంది. దీని వల్ల ఉబ్బరం, తిమ్మిరి, గ్యాస్, కిడ్నీల ఆరోగ్యం పాడవ్వడం వంటి సమస్యలకి కారణమవుతుంది.

**ఈ దోసకాయలు అసలే వద్దు** : తాజాగా కట్ చేసిన దోసకాయలు కొన్నిసార్లు చేదుగా కూడా ఉంటాయి. ఎందుకంటే దోసకాయల్లో కుకుర్బిటాసిన్స్, టెట్రాసైక్లిక్ ట్రైటెర్పెనియోయిడ్ వంటి రసాయనాలు ఉండొచ్చు. ఇవి దోసకాయలను చేదుగా మారేలా చేస్తాయి. ఈ డేంజరస్ కెమికల్స్ ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రాణాంతకమైన అలర్జీలను కలిగిస్తాయి.

**రక్తనాళాలపై ఒత్తిడి** : దోసకాయల్లో దాదాపు 90 శాతం నీరు ఉంటుంది. ఇది నాళాలలో రక్తం పరిమాణాన్ని పెంచుతుంది. ఇది గుండెకి రక్తాన్ని పంపింగ్ చేసే రక్త నాళాలపై ఒత్తిడిని కలిగిస్తుంది. అధిక ద్రవం తీసుకోవడం నాళాల ఒత్తిడిని పెంచుతుంది. ఎలక్ట్రోలైట్ అసమతుల్యతకి కారణమవుతుంది.

**చివరిగా** : దోసకాయలు మంచివే. కానీ, అవి చేదుగా ఉన్నప్పుడు తినడం, తినాల్సిన వాటి కంటే ఎక్కువ తినడం వల్ల మంచి కంటే ఆరోగ్యానికి నష్టం జరుగుతుంది. ఇదే సూత్రం అన్ని ఆహార పదార్థాలకి వర్తిస్తుంది.

# ఛాతీలో కఫాన్నితొలగించే పసుపు



ఛాతీ రద్దీ అనేది చాలా మందిని చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. కానీ తరచుగా దాన్ని ఎలా తొలగించాలి అనేది చాలా మందిని ప్రభావితం చేసే విషయం. అయితే ఆసుపత్రికి వెళ్లకుండానే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు

ఛాతీ రద్దీ సాధారణ రద్దీ కంటే చాలా తీవ్రమైన పరిస్థితి. దీనిని పరిష్కరించడానికి ఏమి చేయాలో తరచుగా గందరగోళాన్ని సృష్టిస్తుంది. ఛాతీలో కఫం తరచుగా శ్వాసలోపం మరియు ఛాతీ నొప్పి యొక్క అసౌకర్యాన్ని తీవ్రతరం చేస్తుంది.

పసుపు ఇన్ని హెల్త్ కేర్ బెనిఫిట్స్ అందించేది మరేదీ లేదని చెప్పొచ్చు. ఇది విషానికి కూడా అనేక విధాలుగా సంక్షోభం అని చాలా మందికి తెలియదు. ఆరోగ్యానికి చేటు చేసే ఛాతీలో కఫాన్ని పోగొట్టుకోవడానికి పసుపును ఉపయోగించవచ్చు. ఛాతీ ఇన్ఫెక్షన్ల చికిత్సకు పసుపు ఉత్తమమైనది.

పసుపు ఆరోగ్య పరంగా అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. కఫం కోసం పసుపును ఎలా సమర్థవంతంగా ఉపయోగించాలో గమనించాలి. గోరువెచ్చని నీటిలో ఉప్పు, కొద్దిగా పసుపు వేసి మూడు నాలుగు రోజులు ఈ నీళ్ళు తాగితే కఫకట్టు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది ఛాతీలో ఏదైనా పెద్ద కఫాన్ని తొలగిస్తుంది.

పసుపులాగే అల్లం కూడా ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుంది. దీన్ని రోజూ తీసుకోవడం వల్ల కఫమే కాకుండా అనేక ఇతర వ్యాధులకు పరిష్కారాలు కనుగొనవచ్చు. ఇది యాంటీవైరల్ లక్షణాలను కలిగి ఉంటుంది. అల్లంలో యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ వైరల్ పవర్ చాలా ఉంది.

కావలసిన పదార్థాలు ఐదు లేదా ఆరు అల్లం ముక్కలు, ఒక టీస్పూన్ ఎండుమిర్చి, ఒక టీస్పూన్ తేనె మరియు రెండు కప్పుల నీరు. నీటిని వేడి చేసి అందులో అల్లం వేసి మరిగించి వీలైనంత వరకు నీటిని వడకట్టాలి. తర్వాత అందులో కాస్త తేనె మిక్స్ చేసి తినాలి. ఇది ఛాతీలో కఫం వదిలించుకోవడానికి సహాయపడుతుంది.

ఆపిల్ సైడర్ వెనిగర్ ఆరోగ్య సంరక్షణ మరియు అందం రెండింటికీ ఉపయోగించవచ్చు. ఆపిల్ సైడర్ వెనిగర్ కఫం చికిత్సకు కూడా ఉపయోగించవచ్చు. ఇది ఛాతీలో కఫం నుండి త్వరగా ఉపశమనాన్ని అందిస్తుంది. ఈ ప్రమాదకరమైన ఆరోగ్య సంరక్షణ పరిస్థితికి ఇది త్వరిత పరిష్కారం.

ఆరోగ్య రక్షణ కోసం మరియు ఛాతీ రద్దీని తగ్గించడానికి, ఆపిల్ సైడర్ వెనిగర్‌ను కొద్ది మొత్తంలో తీసుకుని, ప్రతిరోజూ మీ బుగ్గలపై రుద్దండి. ఇది అన్ని కఫం మరియు జలుబు సమస్యలను నయం చేస్తుంది. ఆపిల్ సైడర్ వెనిగర్ ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తుంది.

ఇది కాకుండా, ఛాతీలో కఫం వదిలించుకోవడానికి పైన పేర్కొన్న పద్ధతులను ఉపయోగించవచ్చు. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే పద్ధతులు అనడంలో సందేహం లేదు. మరొక పరిష్కారం ఆవిరి పట్టుకోవడం. ఇది మనమందరం చేసే పని, కానీ మనం కొద్దిగా భిన్నమైన రీతిలో ఆవిరిని పట్టుకోవచ్చు. ఎలాగో చూద్దాం. ఆవిరి పట్టాలంటే కొద్దిగా కర్పూరం తులసిని ఐదు కప్పుల నీళ్లలో వేసి ఆవిరి మీద ఉడికించాలి. ఇది కఫాన్ని వదులుతుంది. ఈ ఆవిరి సంగ్రహణ పెద్ద అస్థిరమైన కఫాన్ని కూడా నిరోధించడంలో సహాయపడుతుంది.

# రోజుకు ఎన్ని నీళ్లు తాగాలో ఫార్ములా చెప్పిన ఎక్స్‌పర్ట్స్



మనం ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి రో జూ తగినంత నీరు తాగడం తప్పనిసరి. నీరు మనల్ని హైడ్రేట్‌గా ఉంచి, శరీరంలోని మురికిని తొలగించడంలో సహాయపడుతుంది. అయితే, శరీరాన్ని శు భ్రపరచడానికి ఎంత నీరు త్రాగాలి? అనే ప్రశ్నకు చాలా మంది దగ్గర సమాధానం ఉండదు. నీరు తక్కువగా తాగినా? ఎక్కువగా తీసుకున్నా ఆరోగ్యానికి నష్టం జరిగే అవకాశం ఉంది.

సరిపడా నీళ్లు తాగితే ఈ లాభాలు ఉంటాయి. నీరు శరీరంలో అనేక విధులు నిర్వహిస్తుంది. కణాలకు పోషణ, ఆక్సిజన్ పంపిణీ చేస్తుంది. మూత్రాశయం, శరీరం నుండి మురికిని (బాక్టీరియా, టాక్సిన్స్) తొలగిస్తుంది. సరైన జీర్ణక్రియ మలబద్ధకాన్ని నివారిస్తాయి. బీపీని కంట్రోల్‌లో ఉంచుతుంది. కీళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీర భాగాలు, కణ జాలాలను రక్షిస్తుంది. సాధారణ శరీర ఉష్ణోగ్రతను నిర్వహిస్తుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ చేస్తుంది. సరిపడా నీళ్ల తాగకపోతే నష్టాలు. కిడ్నీ సంబంధిత సమస్యలు, రక్తప్రసరణ సమస్య, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జీర్ణ సంబంధమైన సమస్యలు, శరీరం తాజాదనాన్ని కోల్పోవడం, అధిక బరువు, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు మొదలైన సమస్యలు ఎదురవుతాయి.

**నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల వచ్చే నష్టాలు**

మీరు నీరు ఎక్కువగా త్రాగితే, అది ఓవర్ హైడ్రేషన్‌కు దారితీస్తుంది. దీని వల్ల తరచుగా మూత్రవిసర్జన, శరీరంలో ఎలక్ట్రోలైట్స్ లేకపోవడం, వికారం, చేతులు, కాళ్ల రంగులో మార్పు, కండరాల తిమ్మిరి, తలనొప్పి, అలసట వంటి సమస్యలు ఉన్నాయి.

**ఎన్ని నీళ్ల తాగాలి**

మన వయస్సు, శారీరక శ్రమ, జండర్, ఉష్ణోగ్రత, శరీర బరువుపై మనం ఎన్ని నీళు తాగాలో ఆధారపడి ఉంటుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పేర్కొంది. తి గంటకు 2 నుంచి కప్పుల నీరు త్రాగాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. వాతావరణం వేడిగా ఉంటే, వ్యాయామం చేస్తుంటే వాటర్ క్వాంటిటీ ఇంకా పెంచాలి. ఒక ఆరోగ్యకరమైన మనిషి ఒక రోజులో 2-3 లీటర్ల నీరు త్రాగాలి.

**మీ యూరిన్‌ను టెస్ట్ చేయండి**

మన యూరిన్ రంగు మన ఆరోగ్యం గురించి చెబుతుంది. మన యూరిన్ ముదురు రంగులో ఉంటే అది డీహైడ్రేషన్‌కు సంకేతం. అదే సమయంలో, తరచుగా క్లియర్‌గా యూరిన్ వస్తే ఓవర్-హైడ్రేషన్‌కు కారణం.

# జుట్టు పెరగడానికి, చుండ్రు తగ్గించడానికి జుట్టుకి గ్లిజరిన్ ఎలా ఉపయోగించాలి

గ్లిజరిన్ బ్యూటీ కేర్ ప్రొడక్ట్స్‌లో ఉపయోగించే ఒక గొప్ప పదార్థం. ఇది షాంపూలు, కండిషనర్లు, సబ్బులు, బాడీ లోషన్లు మొదలైన వాటిలో కూడా విస్తృతంగా ఉపయోగించబడుతుంది. గ్లిజరిన్ వాతావరణం నుండి తేమను తీసి జుట్టులో ఉంచడానికి సహాయపడుతుంది.

గ్లిజరిన్ స్కాల్ప్‌కు తేమను అందించి, ఆరోగ్యవంతమైన జుట్టును ప్రోత్సహిస్తుంది. పొడి మరియు దురద స్కాల్ప్ కోసం ఇది విలువైనది. గిరజాల మరియు మందపాటి జుట్టుతో సహా అన్ని రకాల జుట్టుకు గ్లిజరిన్ అనుకూలంగా ఉంటుంది.

జుట్టుకు గ్లిజరిన్ ప్రయోజనాలు తేమను నిలుపుకుంటుంది - చర్మం వలె, జుట్టుకు తేమ అవసరం. గ్లిజరిన్ జుట్టు మరియు స్కాల్ప్ హైడ్రేట్‌గా ఉంచుతుంది. ఇది వాతావరణం నుండి తేమను జుట్టులోకి లాగడం ద్వారా జుట్టును మృదువుగా మరియు తేమగా చేస్తుంది. జుట్టు పొడవును మెరుగుపరుస్తుంది - గ్లిజరిన్ జుట్టును బాగా హైడ్రేట్ చేస్తుంది కాబట్టి, ఇది విరిగిపోకుండా చేస్తుంది మరియు జుట్టు పొడవును పెంచుతుంది.

జుట్టు కోసం గ్లిజరిన్ యొక్క ప్రయోజనాలు తల దురదను నివారిస్తుంది - గ్లిజరిన్‌ను రెగ్యులర్‌గా ఉపయోగించడం వల్ల తల పొడిబారడం మరియు దురదను నివారించవచ్చు. చుండ్రును నివారిస్తుంది- చుండ్రు అనేది చాలా మందికి సాధారణ సమస్య. మీరు చుండ్రును వదిలించుకోవడానికి గ్లిజరిన్ హెయిర్ మాస్కని ఉపయోగించవచ్చు. స్ప్లిట్ ఎండ్‌లను నివారిస్తుంది - గ్లిజరిన్ ఆధారిత హెయిర్ స్ప్రేని రోజూ ఉపయో గించడం వల్ల చివర్లు చీలిపోవడాన్ని నివారించవ చ్చు. జుట్టుకు పోషణ కోసం హెయిర్ వాష్ తర్వాత గ్లిజరిన్ హెయిర్ స్ప్రేని ఉపయోగించండి.



గ్లిజరిన్ హెయిర్ స్ప్రే ఈ హెయిర్ స్ప్రే చేయడానికి మీకు స్ప్రే బాటిల్, నీరు, రోజ్ వాటర్, ఎసెన్షియల్ ఆయిల్ మరియు గ్లిజరిన్ అవసరం. కంటైనర్‌లో 1/4 వంతు నీరు నింపి, 1/2 కప్పు రోజ్ వాటర్ వేసి, 2-3 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ వేసి, 2 టేబుల్ స్పూన్ల గ్లిజరిన్ వేసి బాగా షేక్ చేయండి. మీ జుట్టును తడి చేసి, మీ జుట్టు మీద అప్లై చేయండి మరియు మీ జుట్టును దువ్వెన చేయండి. ఇలా చేయడం వల్ల పొడిబారిన మరియు చిట్లిన జుట్టుకు పోషణ లభిస్తుంది. మీకు ఆయిల్ స్కాల్ప్ ఉంటే, మీ జుట్టు పొడవు మరియు చివర్లలో మాత్రమే ఉపయోగించండి.

గ్లిజరిన్ మరియు గుడ్డు హెయిర్ మాస్క్ దీని కోసం మీకు ఒక గుడ్డు, 1 టేబుల్ స్పూన్ తేనె మరియు ఒక టేబుల్ స్పూన్ గ్లిజరిన్ అవసరం. అన్ని పదార్థాలను కలపండి మరియు హెయిర్ బ్రష్‌ని ఉపయోగించి జుట్టుపై సమానంగా వర్తించండి. 30 నిమిషాల తర్వాత, షాంపూ మరియు కండీషనర్‌తో మీ జుట్టును బాగా కడగాలి.

కండీషనర్‌కు గ్లిజరిన్ జోడించండి 100ml సీసా కండీషనర్‌కు 20ml గ్లిజరిన్ జోడించండి. బాటిల్‌ని బాగా కదిలించి కలపాలి. ఎప్పటిలాగే మీ జుట్టుకు కండీషనర్ ఉపయోగించండి. జుట్టును సమర్థవంతంగా హైడ్రేట్ చేయడానికి కండీషనర్‌ను కడిగే ముందు ఎల్లప్పుడూ కనీసం 3-4 నిమిషాలు వేచి ఉండండి.

గ్లిజరిన్ మరియు తేనె మాస్క్ సమాన పరిమాణంలో తేనె మరియు గ్లిజరిన్ కలపండి. హెయిర్ బ్రష్ ఉపయోగించి జుట్టుకు సమానంగా వర్తించండి. 30 నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. మీరు మృదువైన మరియు మృదువైన జుట్టును పొందవచ్చు.

అలోవెరా, గ్లిజరిన్ ఇది మీ జుట్టుకు చికిత్స చేయడానికి గ్లిజరిన్‌ని ఉపయోగించే మరొక మార్గం. ఒక టేబుల్ స్పూన్ గ్లిజరిన్‌లో 2 టేబుల్ స్పూన్ల కలబంద జెల్ మిక్స్ చేసి 3-4 నిమిషాల పాటు తలకు మృదువుగా మసాజ్ చేయండి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా చేయడం వల్ల జుట్టు రాలడాన్ని నివారిస్తుంది మరియు జుట్టు పరిమాణం పెరుగుతుంది.

కాస్టర్ ఆయిల్ మరియు గ్లిజరిన్ ఆముదం మరియు గ్లిజరిన్ యొక్క పోషక లక్షణాలతో, ఈ మాస్క్ మీ జుట్టును మృదువుగా మరియు తేమగా ఉంచుతుంది. గ్లిజరిన్ మరియు ఆముదం ఒక్కొక్కటి 5 టేబుల్ స్పూన్లు తీసుకుని బాగా కలపాలి. జుట్టు పొడవు మీద దీన్ని వర్తించండి. 20 నిమిషాల తర్వాత, తేలికపాటి షాంపూతో మీ జుట్టును కడగాలి.

రోజ్మేరీ ఆయిల్ మరియు గ్లిజరిన్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి మరియు జుట్టు రాలడాన్ని నివారించడానికి ఇది సహజమైన మార్గం. 2 కప్పుల నీటిని తీసుకోండి, కొన్ని చుక్కల రోజ్మేరీ ఎసెన్షియల్ ఆయిల్ మరియు 2 టీస్పూన్ల గ్లిజరిన్ జోడించండి. స్ప్రిట్జర్ బాటిల్‌లోకి మార్చండి మరియు దానిని తలపై పూయండి. వెడల్పాటి పంటి దువ్వెనతో జుట్టును దువ్వండి. షాంపూ ఉపయోగించకుండా ఒక గంట తర్వాత మీ జుట్టును కడగాలి. జుట్టు పెరుగుదలను వేగవంతం చేయడానికి వారానికి రెండు లేదా మూడు సార్లు ఇలా చేయండి.

గ్లిజరిన్, తేనె, గుడ్డు, ఆముదం, కొబ్బరి నూనె మరియు ఆలివ్ ఆయిల్ మాస్క్ డ్రై మరియు డ్యామేజ్డ్ హెయిర్‌కి ఇది పోషకమైన హెయిర్ మాస్క్. 2 టేబుల్ స్పూన్ల ఆముదం, 2 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె, 1 టీస్పూన్ గ్లిజరిన్, 1 గుడ్డు మరియు 1 టీస్పూన్ తేనె మిక్స్ చేసి తలకు మరియు జుట్టుకు పట్టించాలి. ఒక గంట తర్వాత, తేలికపాటి షాంపూతో మీ తలను బాగా కడగాలి.

# యాపిల్ సైడర్ వెనిగర్ తాగుతున్నారా..



యాపిల్ సైడర్ వెనిగర్ మొత్తం కొలెస్ట్రాల్, LDL అంటే చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయన్ని నిరూపణ కాలేదు. అయితే, దీనిని తీసుకోవడం వల్ల జంతువులు, మనుషులల్లో ఎన్నో ఎఫెక్ట్స్ ఉంటాయి.

**యాంటీ మైక్రోబియల్ బెనిఫిట్స్**

చాలా రోజుల నుండి ACV దాని యాంటీ మైక్రోబయల్ లక్షణాల కోసం వాడతారు. అయితే ఇటీవలి అధ్యయనాలు ఈకోలి వంటి బ్యాక్టీరియాను తగ్గించడంలో ప్రభావాన్ని చూపిస్తాయి. అయినప్పటికీ అంటువ్యాధులను తగ్గించడంలో ఇదొక్కటే పరిష్కారం కాదని కూడా అధ్యయనం చెబుతోంది.

**బరువు తగ్గతారా**

ACV బరువు తగ్గిస్తుందని ఎక్కడ నిర్ధారణ కాలేదు. కానీ, కొన్ని అధ్యయనాలు ACV గ్యాస్ట్రిక్‌ని తగ్గించడం, లిపోలిసిస్ పెరుగుదల అంటే కొవ్వుని తగ్గించడం, గ్లూకోజ్ పెరిగిన కారణంగా అనేక లాభాలను తీసుకొస్తాయని చెబుతుంది. ఈ కారకాలు పరోక్షంగా బరువు తగ్గడాన్ని ప్రభావిం చేస్తాయి. అయినప్పటికీ ఆహారం, వ్యాయామం లేకుండా ACV మాత్రమే తీసుకుంటే లాభం లేదు.

**ACV నష్టాలు**

ACVలో అధికంగా ఆమ్లత్వం ఉంటుంది. ఈ కారనంగా గర్భిణీ, పాలిచ్చే తల్లులకి అంత మంచిది కాదు. దంతాలలో ఉండే ఎనామెల్‌కి అస్సలు మంచిది కాదు. దీనిని తీసుకున్న తర్వాత దంతాల ఎనామెల్‌కి నష్టం జరిగిందని ఎలుకల్లో చేసిన అధ్యయనాలు చూపిస్తున్నాయి. కానీ మనుషులపై చేసిన ఏ పరిశోధన నిరూపించలేదు. ACVని డైరెక్ట్‌గా ఎప్పుడు తీసుకోకూడదు. ఓ గ్లాస్ నీటిలో కొద్ది పరిమాణంలో కలిపి దానిని మాత్రమే తాగాలి.

**జీర్ణ సమస్యలు**

కొద్ది మందికి ACV తీసుకోవడం వల్ల అజీర్ణ సమస్యలు కారణమవుతుంది. వారికి వికారంగా అనిపిస్తుంది. అందుకే తీసుకోకపోవడమే మంచిది.

**ఎలా తీసుకోవాలంటే**

ACVలో ఎక్కువగా ఆమ్లత్వం ఉంటుంది. కానీ, దీని వల్ల కొంతమందికి ఇబ్బంది కలుగుతుంది. అయితే నీటిలో కలిపి తాగితేనే మంచిది.

1 స్పూన్ ఫుల్ ACVని ఓ గ్లాసు నీటిలో కలపండి. భోజనానికి 15 నుంచి 20 నిమిషాల ముందు దీనిని తాగడం మంచిది.

# జొన్న రొట్టెలు తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు?



జొన్న రొట్టెలు ఆరోగ్యానికి మంచివంటారు. మన భారతదేశంలో జొన్నలను బాగానే పండిస్తుంటారు. గతంలో కంటే ఈ మధ్య కాలంలో జొన్న రొట్టెలను తినేవారి సంఖ్య పెరిగిపోయింది. ఎందుకంటే జొన్నల్లో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. చపాతీ మాత్రమే తినేవాళ్లు ఇప్పుడు జొన్న రొట్టెలను తినేందుకు ఇష్టపడుతున్నారు. జొన్న రొట్టెలు చాలా బలవర్ధకమైన ఆహారం అనే చెప్పాలి. జొన్న రొట్టెల వల్ల ఎముక బలంగా ఉంటాయి. జొన్న పిండితో చేసిన ఇతర వంటకాలు సులభంగా అరుగుతాయి. దాని వల్ల బరువు పెరగకుండా ఉంటారని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జొన్నల్లో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండటం వల్ల చెడు కోలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. దాని వల్ల గుండె జబ్బులు రాకుండా స్ట్రోక్ రాకుండా ఉంటాయి. అందుకు క్రమం తప్పకుండా జొన్న రొట్టెలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**జొన్నరొట్టెలతో ప్రయోజనాలు:**

జొన్నల్లో గ్లూటెన్ ఉండదు. ఫైబర్ అధికంగా ఉంటుంది.

రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే గుణం ఉంది.

జొన్నల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది.

ఐరన్, మెగ్నీషియం, కాపర్, కాల్షియం, జింక్, విటమిన్ బీ3 వంటివి ఉండటం వల్ల ఎముకలకు ఎంతో బలం.

బరువు తగ్గాలనుకునేవారికి జొన్నలు ఎంతో ఉపయోగకరం.

మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

జొన్న రొట్టె గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది.

రక్త ప్రసరణ మెరుగు పడుతుంది.

జొన్నల్లో కాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా ఉండే విధంగా చేస్తుంది. అలాగే రక్తం బాగా తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనత నుంచి బయటపడవచ్చు.

**షుగర్ లెవల్స్ కంట్రోల్**

జొన్నలతో డయాబెటిస్ ఉన్నవాళ్లకు షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. జొన్న రొట్టె డయాబెటిస్ వాళ్లకు ఎంతో మేలు చేస్తుంది. జొన్నల్లో ప్రోటీన్స్, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యల నుంచి బయటపడవచ్చు. జొన్నల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటితో పాటు గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలను దూరం చేస్తాయి.

# అక్షర దక్షిణ (కథ)

**రచన .శ్యామకుమార్ చాగల్**

హై స్కూల్ ఆవరణ పిల్లల అరుపులతో నిండిపోయింది. శాస్త్రి ప్రవేశం తో మొత్తంగా ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. కాస్త ఎత్తులో ఉన్న స్టేజి మీదెక్కి చేతిలో కర్ర తో అందరి వంకా గంభీరంగా చూసాడు శాస్త్రి. కొద్దిసేపటికి హెడ్ మాస్టర్, మరికొందరు ఉపాధ్యాయులు వచ్చి మౌనంగా నిలబడ్డారు.

ఆఫీస్ రూమ్ లోకి వెళ్లి కిటికీ లో నుండీ వీరందరిని చూసిన శాస్త్రి వెంటనే అక్కడున్న మీట నొక్కాడు. దీంతో వందే మాతరం గీతం మొదలైంది. దాని తర్వాత జనగణమన జాతీయ గీతం మొదలైయ్యింది.

అది పూర్తవగానే విద్యార్థులందరూ ఒకే వరసలో నడుస్తూ తమ తమ తరగతుల్లోకి వెళ్లిపోయారు.

మొదటి గంట టంగు మంటూ మ్రోగింది.

కాసేపట్లో తరగతుల్లోకి ఉపాధ్యాయులు చేరుకున్నారు. బడి ఆవరణ అంతా నిశ్శబ్దం ఆవరించింది.

ఏడవ తరగతి గది లో సైన్స్ పాఠం జరుగుతూ వుంది. బోర్డు మీద రాస్తూ విషయాన్ని వివరిస్తున్నాడు శాస్త్రి.

విద్యార్థినీవిద్యార్థులందరూ ఏకాగ్రతతో వింటున్నారు. ఆయన చెప్తున్నది వింటున్న విద్యార్థులందరికీ అయితే డాక్టర్లు లేక సైంటిస్ట్ అవ్వాలని అనుకోసాగారు. శాస్త్రి క్లాస్ ఉన్నంత సేపూ విద్యార్థులు మంత్ర ముగ్ధులై వింటారు.

అతనంటే విద్యార్థులందరికీ ఎనలేని గౌరవం. కాస్త భయం కూడా. పాఠం చెప్తూ ఒక సారి అందరికేసీ చూస్తున్న శాస్త్రి చూపు లక్ష్మి మీద నిలిచింది. పాఠం చెప్పటం ఆపి లక్ష్మి ని లేవమని చెప్పి సూటిగా కళ్ళల్లోకి చూసి అడిగాడు" ఎమ్మా నుదుటన బొట్టేన్తి ఈ రోజు మాయమైంది ?"

తల కిందకు వేసుకుని నిలబడింది లక్ష్మి.

"ఏంటి ఫ్యాషనా? ఎంత పెద్దగా ఎదిగినా సరే మనం మన పద్ధతి, సంస్కారం మరవ కూడదు. కూర్చో" అని చెప్పి పాఠం చెప్పటం పూర్తి చేసాడు.

"ఏరా సుధాకర్ నాలుగు రోజుల నుండీ రాలేదేం ?" అడిగాడు శాస్త్రి "మా అయ్యతో పొలం కోతలకు వెళ్లాను సార్ "అన్నాడు సుధాకర్ లాగును పైకి చెక్కుకుంటూ.

"సరే కూర్చో. మీ నాన్నను రేపు వచ్చి నన్ను కలవ మను." అని చెప్పి,బోర్డు వైపు తిరిగి పాఠం చెప్పసాగాడు.

స్కూల్ ఆఖరి గంట కొట్టారు. విద్యార్థులందరూ బిల బిల మంటూ ఇండ్లకు వెళుతూ వున్నారు. స్కూటర్ ఆపి ఇంట్లోకి వెళ్లి గుమ్మం వద్ద కాళ్ళు కడుక్కుని లోనికి అడుగు పెట్టాడు శాస్త్రి.

కొద్ది సేపటికి పంచె కట్టుకొని వాలు కుర్చీలో కూర్చున్న శాస్త్రి చేతికి కాఫీ కప్ అందించింది భార్య పావని. కప్ అందుకుని భార్య ను తృప్తిగా చూసాడు, నుదుటన నిండుగా ఎర్రని బొట్టు, అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు. చెరగని చిరునవ్వుతో, లక్ష్మీ దేవిలా కనిపించింది. వారికి ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. అందరూ కాలేజీ చదువులకు చేరుకున్నారు.

"ఇదిగో, ఏమండీ, మన చిన్నోడి ఫీజు కట్టాలి" అంది పావని.

"జీతం రాగానే, మొదటి రోజే కట్టెద్దువు గానీ" అన్నాడు.

"కాలం నుండీ ఇదే సమస్య మనకు. ఆ సుబ్బారావు గారు చూడండి, సాయంత్రం మూడు బ్యాచీలు,ఉదయం మూడు బ్యాచీలు ఇంట్లో ట్యూషన్‌లు. చక్కటి సంపాదన. మీరేమో ట్యూషన్‌లు చెప్పనంటారు. మీకు మంచి పేరు వుంది. చెప్తే మనకు బాగుంటుంది కదా" అంది మెల్లిగా సముదాయించుతూ.

"పిచ్చి దాన, స్కూల్‌లో వున్న సమయంలో మనం చక్కగా చెప్తే ఎవరికీ ఇంటికొచ్చి ట్యూషన్ చెప్పించుకునే అవసరం రాదు." అన్నాడు చిన్న చిరునవ్వుతో.

"అంటే మిగతా వారందరూ చెప్తున్నారుగా, మీకెందుకు ఆ డబ్బులు చేదు"అంది పావని నిష్టూరంగా, కొంగుతో మొహం తుడుచుకుంటూ.

"పావని.. నాకంటూ కొన్ని సిద్ధాంతాలు, నమ్మకాలున్నాయి. నీకు తెలుసుగా" అన్నాడు శాస్త్రి పావని కేసి చూసి నవ్వుతూ "దానికెవరు అడ్డుపడటం లేదండి. మనకు డబ్బులు వస్తాయిగా" అంది.

"ఏం..మనకు జీతాలు రావడం లేదా? మనం న్యాయంగా చదువు చెప్పటానికి ప్రభుత్వం మాంచి జీతాలిస్తోంది. మన ఖర్చులు తగ్గించుకుని , ఉన్నంతలో స్కూల్ లో విద్యార్థులకు న్యాయం చేయాలి. అంతే గానీ స్కూల్ లో సరిగ్గా చెప్పకుండా,వాళ్ళను ఇంటికి పిలిపించుకుని డబ్బులు సంపాదించడం సరి అయిన మార్గం కాదు" అన్నాడు.

"సరే..నా పిచ్చి గానీ ఇన్నేళ్లు వినని వారు ఇప్పుడు మాత్రం వింటారా?" అని నవ్వి భర్త కేసి అభిమానంగా చూసి, ఖాళీ కప్ తీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది పావని.

కళ్ళు మూసుకుని ఆలోచనల్లో పడి ఇరవై అయిదు సంవత్సరాలు వెనక్కి గతంలోకి వెళ్లి పోయాడు.

ఆ రోజు బిఈడీలో సీట్ వచ్చింది. ఇంట్లో శాస్త్రి తల్లి రుక్మిణీ, తండ్రి నారాయణ, గుడికి శాస్త్రి ని తీసుకెళ్లి దేవుడి మ్రొక్కు తీర్చుకుని ఊపిరి పీల్చుకున్నారు.

"ఈ చదువు అయిపోగానే నీకు ఉద్యోగం ఖాయమట కదురా, కన్నయ్య" అంది రుక్మిణి తృప్తిగా కొడుకు తల నిమురుతూ.

"అవునే అమ్మా" అన్నాడు శాస్త్రి తృప్తిగా.

"ఏదో నాయన, ఆ టీచర్ ఉద్యోగం వస్తే చాలు, మన కుటుంబానికి దేవుడు పెద్ద సాయం చేసినట్లే. ఆ జీతం తో నీ జీవితం సాఫీగా గడిచి పోతుంది." అని నిట్టూర్చింది రుక్మిణి.

"గురువు ఉద్యోగం అంటే జీతం రాళ్లు కాదు, రుక్మిణి. అదో పెద్ద గురుతర బాధ్యత. వాడి జీవితంలో ఎన్నో వేల పిల్లల జీవితాలను తీర్చి దిద్దే అతి పవిత్రమైన కార్యం. అందులో ఎంతో మంది చేతుల్లో భావి తరంలో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఎంతో మంది పిల్లల జీవితాలలో వెలుగులు నింపాలి. అదీ ఒక గురువు చేసే పని. అంతే కానీ దాన్ని ఒక మామూలు ఉద్యోగం లాగ అనుకోకూడదు. అలా ఉద్యోగం చేసి, సంపాదనే కావాలంటే ఇంకా చాలా చాలా ఉద్యోగాలున్నాయి"అని చెప్పి కొడుకు వైపు చూశాడు నారాయణ.

తండ్రి కళ్ళలోకి కళ్ళు పెట్టి, గౌరవంగా చూసి" అవును నిజమే నాన్న గారు" అన్నాడు శాస్త్రి.

కొన్ని సంవత్సరాల తర్వాత ఒకరోజు పోస్ట్ మ్యాన్ తెచ్చిన, బ్యాంకు ఉద్యోగంలో భర్తీకమ్మనే ఉత్తరంతో ఇంట్లో సంతోషాలు వెల్లివిరిశాయి.

భార్య మొహం చూసాడు శాస్త్రి. పావని మొహం వెలిగిపోతూ వుంది. "ఈ రోజు భలే శుభ దినం కదూ" అంది.

"నాకా ఉద్యోగానికి వెళ్లాలని లేదు పావని" అన్నాడు కాఫీ చప్పరిస్తూ.

అది విని బిత్తర పోయింది "ఎందుకని..జీతం పెరుగుతుంది. భవిష్యత్తులో ప్రమోషన్లుంటాయి. పైగా మీరింకా ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు జరిపించాలి. ఆర్థికంగా నిలదొక్కు కోవచ్చు." అంది .

"ఏమో పావని, నాకీ టీచర్ ఉద్యోగం చాలా తృప్తినిస్తోంది. ఎంతో మంది విద్యార్థులకు భవిష్యత్తు ఇవ్వచ్చు." అన్నాడు నిట్టూరుస్తూ.

"కానీ బ్యాంకు ఆఫీసర్ గా మీకు , మాకందరికీ ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి వెళ్ళడానికి వుండే సౌలభ్యం ఇప్పుడున్న ఉపాధ్యాయ వృత్తి లో ఎక్కడుంది?" అడిగింది దిగాలుగా.

ప్రతి పనిలో మానసిక ఆనందం, జీవితంలో తృప్తి కూడా అవసరం పావని. నువ్వే అర్థం చేసుకో. నాకిక్కడ ఉదయం లేచిన దగ్గర్నుంచి ఎంతో మంది బీద విద్యార్థులకు, తెలివైన పిల్లలకు వారి భవిష్యత్తు కై మంచి మార్గం చూపుతున్నాను. అందులో వున్న ఆనందం ఇంకెక్కడొస్తుంది చెప్పు. "అని చెప్పి కళ్ళు మూసుకున్నాడు.

కాసేపు భర్త కేసి ప్రేమగా చూసి చిరునవ్వు నవ్వి లోని కెళ్ళి పోయింది పావని.

"ఏమండి" అన్న భార్య పిలుపుతో గతంలో నుంచీ ఈ లోకంలో కొచ్చాడు శాస్త్రి.

"ఏంటి?" అన్నాడు ఉలిక్కి పడి, భార్య వైపు చూసి.

"రండి, చపాతీలు వేడిగా వున్నాయి" అంది.

లేచి డైనింగ్ టేబుల్ వద్దకు నడిచాడు శాస్త్రి.

ఆ రోజు వర్షం విపరీతంగా కురుస్తోంది. పైగా హోరుగాలి. దాంతో ఆ గాలికి వర్షం జల్లు ఎడా పెడా కొట్టసాగింది. రోడ్లన్నీ వర్షం తో మునిగి మోకాలి లోతున పారుతూ వున్నాయి నీళ్లు.


స్కూల్‌లో విద్యార్థులు దాదాపు రాలేదు. ప్రధానోపాధ్యాయుడి గదిలో ఉపాధ్యాయులందరూ కూర్చొని బడి ని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చు ? అని చర్చించుకుంటున్నారు. అందరూ తలా ఒక సూచన చేసారు.

శాస్త్రి మాత్రం ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండటం గమనించిన ప్రధాన ఉపాధ్యాయులు రామయ్య "శాస్త్రి మీరేంటి ఏమీ చెప్పటం లేదు" అన్నాడు.

ఆ మాట విని లేచి నించున్నాడు శాస్త్రి. అందరూ మాట్లాడుకోవడం మానేసి ఆసక్తిగా శాస్త్రి వైపు చూసారు.

అప్పుడు చెప్పటం మొదలు పెట్టాడు శాస్త్రి.

"ముందుగా విద్యార్థులకు సరి అయిన మరుగు దొడ్లు కావాలి. వారికి విషయం సులభంగా అర్థం కావడానికి దేశ, ప్రపంచ పటాలు అవసరం. సైన్సుకు సంబంధించినవైతే, అవెంత అత్యావశ్యకమో



మనకందరికీ తెలుసు. ముఖ్యంగా సైన్సు పరికరాలు కొన్ని ఉంటే పై తరగతిలో వాళ్లకు వాటి గురించి అవగాహన పెరిగి విజ్ఞానం పెంపొందడమే కాక వికాసం కూడా పెరుగుతుంది." అని చెప్పడం ఆపి అందరి వంక చూసాడు శాస్త్రి.

చాల మంది ఉపాధ్యాయులు నిరాసక్త తో చూసారు. కొందరు అసహనంగా కదిలారు.

"అవన్నీ ప్రభుత్వం చూసుకోవాలి. మన పని కాదు "అన్నాడు, లెక్కల మాస్టర్ అప్పారావు.

"అవును, అవన్నీ పెద్ద పెద్ద ప్రణాళికలు, మనకెందుకు" కాస్త చిరాకుగా అన్నాడు సోషల్ మాస్టర్ సూరి.

అవన్నీ గమనించిన ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, శాస్త్రి వేపు చూసి నిజమే, మీరు చెప్పిన అంశాలు బాగున్నాయి. కానీ వాటికి బోలెడు ఖర్చు. మనకంత బడ్జెట్ ఎక్కడుంది?" అన్నాడు నిస్సహాయంగా మొహం పెట్టి.

"ఇవన్నీ చొప్పదంటు ప్రణాళికలు. వాటి గురించి మాట్లాడటం సమయం వృధా" అన్నాడు తెలుగు మాస్టర్ శర్మ.

అందరి వైపు నవ్వుతూ చూసాడు శాస్త్రి."ప్రణాళిక అంటూ ఒకటుంటే మనం ముందడుగు వేయొచ్చు" అన్నాడు శాస్త్రి.

"అబ్బా శాస్త్రి నీవన్నీ పగటి కలలు..ఊరుకో" అన్నాడు హిందీ మాస్టర్ ప్రకాష్ వెక్కిరింతగా నవ్వుతూ .

బాధగా చూసాడు శాస్త్రి "మన ఊరి పంచాయతీని కూడా కలుపుకుని వారిని కూర్చో బెట్టి ఈ విషయాలను వారి దృష్టికి తెస్తే బాగుంటుంది" అన్నాడు. ఆమాట విని ఆలోచనలో పడ్డారందరూ.

"అంతే కాదు, మన విద్యార్థుల తల్లిదండ్రులను, డి యి ఓ ను కలిపి ఓ మీటింగ్ పెట్టి, వారి సహకారంతో కూడా ముందుకు వెళ్లొచ్చు" అని చెప్పి అందరి వైపు చూసాడు శాస్త్రి.

"ఆలోచించాల్సిన విషయం" అన్నాడు ప్రకాష్.

"ప్రస్తుతం మనం ఒక్కొక్కరం అన్ని రకాలైన విషయాలను బోధిస్తున్నాం. అది సమంజసంగా లేదు. ఉదాహరణకు నేను సైన్స్ చదివాను, కానీ హిస్టరీ కూడా చెప్పాల్సి వస్తోంది. గేమ్స్ టీచర్ లేరు. నా వ్యక్తిగత అభిలాషతో నేను చేస్తున్నాను. నాలాగా చాలా మందికి మన స్కూల్ లో ఇదే సమస్య. దాన్ని కూడా పరిష్కరించాలి. ఎలా అనేది ఆలోచించాలి " అని చెప్పి కూర్చున్నాడు శాస్త్రి.

"త్వరలో నీకు ప్రమోషన్ వచ్చి హెడ్ మాస్టర్ అవుతావు గా, అప్పుడు నువ్వు పరిష్కరించు దువు గానీ." అని వెకిలిగా నవ్వాడు రాజయ్య.

రాజయ్య అన్నట్లుగానే ఆరు నెలల తర్వాత శాస్త్రి అదే స్కూల్ లో హెడ్ మాస్టర్ అయ్యాడు. ఒక వారం తర్వాత ఆ ఊరి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను ఆహ్వానించాడు శాస్త్రి. వారితో, పాఠశాల అధ్యాపకులతో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసాడు.

పాఠశాల అభివృద్ధికి కావాల్సిన సహకారాన్ని అర్థించాడు. విద్యార్థులకు అవసరమైన పరికరాలు కావాలని, వాళ్లను చదువు నుండీ మనసు దారి మళ్లే పనులు చెప్ప వద్దని అర్థించాడు.

శాస్త్రి మాటలు విన్న గ్రామ పెద్దలు ఆశ్చర్య పోయారు. ఊరి నుండీ చందాలు వసూలు చేసి ఇస్తామని మాట ఇచ్చారు. శాస్త్రి చెప్పే విషయాల్లో ఉన్ననిజాన్ని అందులో గల శాస్త్రి నిజాయితీని గమనించారు.

"వచ్చే సంవత్సరం ప్రాథమిక పాఠశాలను తప్పనిసరిగా ఉన్నత పాఠశాల చేస్తాను. అయితే మీరు ఎవరు కూడా మీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపనని నాకు మాట ఇవ్వండి"అన్నాడు శాస్త్రి.

"మీరు మంచి విద్య ఇచ్చి, మంచిగా పాఠాలు చెప్తుంటే అలాగే ఇక్కడే ఉంచుతారు సార్" అన్నాడు ప్రెసిడెంట్ రంగయ్య.

"ఆ కృషి చేస్తాం..దానికి మా అధ్యాపకుల తరఫున హామీ ఇస్తున్నాను" అని చెప్పి, ముందు కూర్చున్న అధ్యాపకుల వైపు చూసాడు శాస్త్రి. అందరూ అవునని తలలూపారు.

ఆ రోజు తో సమావేశం ముగించి తృప్తిగా ఇంటికి వెళ్ళాడు శాస్త్రి. గేట్ బయట మెట్ల పక్కన కూర్చున్న ఒక విద్యార్థిని గమనించి పిలిచాడు.

ఆ అబ్బాయి భయపడుతూ వచ్చి శాస్త్రి ముందు నిలబడ్డాడు.

"ఏంటి ఇంకా ఇంటికెళ్ళకుండా ఇక్కడే వున్నావ్" అడిగాడు.

"రేపటి నుంచి స్కూల్ కు రావద్దని చెప్పారు సార్" అన్నాడు ఏడుపు మొహంతో.

"ఏం ..ఏం జరిగింది ?" అన్నాడు

"అసలు స్కూల్ ఫీజు కట్ట లేదు సార్ మా నాన్న" అన్నాడు తల వంచుకుని. "అదేం లేదు గానీ నువ్వు రోజూ రా , ఏ క్లాస్ నీది" అడిగాడు.

చెప్పాడా విద్యార్థి.

"సరే రోజూ స్కూల్ కి రా, మానొద్దు. మీ సార్‌కి నే చెప్తానులే.. ఫీజు సంగతి నేను చూసుకుంటా" అన్నాడు అబ్బాయి తల నిమిరి.

సరేనంటూ నవ్వుతూ సంతోషంగా పరిగెడుతున్న ఆ అబ్బాయిని చూసి తృప్తిగా ఇంటికి వెళ్ళాడు శాస్త్రి.

ఒక సంవత్సర సమయంలో పాఠశాల చాలా అభివృద్ధి చెందింది. విద్యార్థుల సంఖ్య పెరిగింది. శాస్త్రి ఆఫీస్ రూమ్ లో రోజంతా కూర్చోకుండా కొన్ని తరగతులకు కొన్ని పాఠాలు చెప్పసాగాడు. సైన్స్ విద్యార్థులకు చిన్న ల్యాబ్ ఏర్పాటు చేసాడు.

పెద్ద తరగతుల విద్యార్థులకు, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉదయం, సాయంకాలం ప్రత్యేక బోధన ఏర్పాటు చేయించాడు. పాఠశాల మానకుండా ప్రతీ రోజు వచ్చిన విద్యార్థులకు ప్రతీ నెల బహుమతులు అంద చేయటం మొదలు పెట్టాడు. తరగతుల్లో అడిగిన ప్రశ్నలకు వెంటనే లేచి సమాధానం చెప్పే విద్యార్థులకు కూడా చిన్న చిన్న బహుమతులు ఇవ్వటం అలవాటు చేసాడు. మెల్లిగా పాఠశాల లో విద్య మీద అందరికీ ఆసక్తి హెచ్చి, మంచి పేరు రావడం మొదలయ్యింది.

గ్రామ ప్రజల సహకారంతో, విద్యార్థుల తల్లిదండ్రుల సహాయం తో అదనపు తరగతుల భవనం కట్టించాడు.

చుట్టు పక్కల గ్రామాలల్లో పాఠశాల పేరు అందరికీ తెలిసి తమ పిల్లలను ప్రైవేట్ నుండీ ఈ పాఠశాలకు మార్పించసాగారు. దీంతో వారికి మిగిలిన డబ్బులతో వారు తమ వంతుగా పాఠశాలకు ఆర్థిక సహాయం చేయ సాగారు.

ఆ రోజు శాస్త్రి, రాత్రి భోజనం చేసి బయట వరండాలో కూర్చొని పావనితో మాట్లాడుతూ ఉండగా, ఇంటి ముందు గేట్ దగ్గర నిలబడి ఇద్దరు వ్యక్తులు ఇంటి బెల్ కొట్టారు.

వచ్చిన వారెవరో తెలియక లేచి నుంచుని, "లోనికి రండి" అన్నాడు శాస్త్రి.

ఆ ఇద్దరూ వచ్చి నమస్కారం పెట్టి, శాస్త్రి చూపించిన కుర్చీల్లో కూర్చున్నారు

తాను తిరిగి కూర్చుని "చెప్పండి, మీ పరిచయం?" అన్నాడు శాస్త్రి.

వాళ్లలో ఒకరు గొంతు సవరించుకుని చెప్పారు.

"నేను ప్రైవేట్ స్కూల్ అండ్ కాలేజి అసోసియేషన్ ప్రెసిడెంట్, ఇతను సెక్రటరీ" అని చూపించి నమస్కారం పెట్టారు.

"చెప్పండి మీరు వచ్చిన పని?" అన్నాడు శాస్త్రి చేతులు కట్టుకుని.

కాసేపు నవ్వు మొహం పెట్టి అన్నాడు సెక్రటరీ "మీరు వచ్చిన తర్వాత మా పాఠశాల ల్లో పిల్లలు తగ్గి పోతున్నారు. కాస్త దయ చేసి మీరు మాకు సహాయం చేయాలి సార్. మీకు మేమూ సహాయం చేస్తాం." అరచేతులు రుద్దుకుంటూ.

"నేనే విధంగా చేయగలను ?" అడిగాడు శాస్త్రి.

"మీరు ఏదో విధంగా ఈ సంవత్సరం కొత్త విద్యార్థులను తీసుకోకుండా వుండి, కాస్త మీరు మీ స్కూల్ మీద ఆసక్తి తగ్గిస్తే మేము పుంజుకుంటాం. దానికి ప్రతీ నెలా మేము మా తరపున కాస్త పెద్ద మొత్తం అందజేస్తాం. అంతే కాదు మా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం జాయిన్ చేయిస్తే దానికి కూడా మీకు ..... మాకీ సహాయం చేయండి." అన్నాడు సెక్రటరీ మెల్లిగా, గొంతు తగ్గించి.

అది వినగానే శాస్త్రి నరాలు బిగుసుకున్నాయి. కోపాన్ని అదుపులో పెట్టుకుని "మీరు ఇక లేచి బయలు దేరండి. నాకు కాస్త పనుంది." అని చెప్పి లేచి నిలబడ్డాడు శాస్త్రి.

"మరొక్క సారి ఆలోచించండి.ఇదుగో మా విజిటింగ్ కార్డు" అని ఒక కార్డు అక్కడున్న బల్ల మీద పెట్టి, వెళ్లిపోయారు.

వారిద్దరూ గేటు దాటగానే ఆ కార్డు తీసుకుని కోపంగా దాన్ని పరపరా చింపేసి బయటకు విసిరేసాడు శాస్త్రి.

ఆఫీస్ గదిలో కూర్చుని పని చేసుకుంటూ ఉండగా టేబుల్ మీద ఉన్న ఫోన్ మ్రోగింది.అది లేపి 'హలో' అన్నాడు శాస్త్రి.

"మీ పేరు ఉత్తమ జాతీయ ఉపాధ్యాయునిగా ఎంపిక అయ్యింది. మీరు దానికి అవసరమైన పేపర్లు పంపండి"అంది అటునుండి డీఈఓ కంఠం.

"సరేనండి ...కానీ వాటి పైన నాకు ఏ మాత్రం ఆసక్తి లేదు. దయచేసి మీరేమనుకోవద్దు" అన్నాడు వినమ్రంగా.

"మీ లాంటి వారికి ఆసక్తి లేక పోతే ,అది అనర్హులకు లభిస్తుంది. అది జాతికి మనం చేసిన అన్యాయం అవుతుంది. కనుక శాస్త్రి గారు..ఆ ఫారాలు నింపి పంపండి" అంది డి ఈ ఓ.

ఒక క్షణం ఆలోచించి "సరేనండి. అలాగే పంపిస్తాను " అని ఫోన్ పెట్టేసాడు శాస్త్రి.

కొన్ని రోజులకు శాస్త్రి ఆ బహుమతికి ఎంపిక అయినట్లుగా పేపర్లో వచ్చింది. అది చూసిన శాస్త్రి వెంటనే ఇంటికి వెళ్లి తల్లి తండ్రికి పేపర్ చూపించి వారి కాళ్లకు దండం పెట్టాడు. చుట్టూ పక్కల ఊర్లో శాస్త్రి పేరు మారు మ్రోగిపోయింది.

అవార్డు తీసుకోటానికి ఢిల్లీకి వెళ్లి అది తీసుకుని తిరిగి వచ్చాడు శాస్త్రి. అతని పేరు ప్రతి వార్త పత్రికల్లో, అన్ని టీవీల్లో వచ్చింది.

కొన్ని నెలల తర్వాత, ఒక రోజు స్కూల్ నుండీ రాగానే కాఫీ తాగి భార్యను పిలిచాడు శాస్త్రి .

"ఏంటీ, అలా దిగులుగా ఉన్నారు?" అంది పావని, భర్త మొహం చూసి.

"వచ్చే నెల నా రిటైర్మెంట్ " అన్నాడు శాస్త్రి.

భర్త కేసి తేరిపార చూసింది పావని. వెంట్రుకలన్నీ నెరిసిపోయాయి. మొహం నీరసంగా వుంది.

"అలసి పోయారు. చాలా పని చేశారు జీవితమంతా. ఇక చాలు" అని భర్త మొహాన్ని కొంగుతో తుడిచింది.

"శాస్త్రి, వచ్చే నేలనే కదా రిటైర్మెంట్ ?ఇక హ్యాపీగా ప్రశాంతంగా బ్రతుకు గడపడమే." అంటూ నవ్వాడు ఎదురింటి సుబ్బా రావ్.

"అవునండి" బలవంతంగా నవ్వు తెచ్చు కుని ముందుకు నడిచాడు. శాస్త్రి.

వెంటనే శాస్త్రి మనసులో దిగులు మొదలయ్యింది.

స్కూల్‌లో ఆఫీస్ గదిలో కూర్చొని గుమాస్తాను పిలిచాడు. కాసేపటికి ఎదురుగా వచ్చి నుంచున్న క్లర్క్ సాయన్న ను చూసి మెల్లిగా అడిగేడు "సాయన్న ..నాకు పెన్షన్ ఎంతొస్తుంది?"

చెప్పారు సాయన్న.

అది విని దీర్ఘాలోచనలో పడ్డాడు శాస్త్రి.

"సార్ ..నేను వెళ్ళనా" మెల్లిగా అడిగాడు సాయన్న.

"అంటే..సగానికి తక్కువ వస్తుందన్నమాట" సాలోచనగా అన్నాడు శాస్త్రి.

"అవునండి" అని అలాగే నిలబడ్డాడు సాయన్న.

ఏమీ మాట్లాడ కుండా ఆలోచిస్తున్న శాస్త్రి ని చూసి ,వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు సాయన్న.

అఖరి గంట కొట్టగానే, అన్యమనస్కంగా అందరితో మాట్లాడి, ఇంటికి బయలుదేరాడు శాస్త్రి.

రాత్రి చపాతీలు తిని, ఆరుబయట మల్లె పందిరి కింద కూర్చున్నాడు శాస్త్రి. కాసేపటికి పావని వచ్చి ఇంకొక కుర్చీలో కూర్చుంది.

నీరసంగా కూర్చున్న భర్త ని చూసి "ఏవిటండీ..నెల నుండీ చూస్తున్నాను, ఎందుకు అదోలాగ ఉంటున్నారు. స్కూల్‌లో ఏదైనా సమస్యా ?" అంది.

"ఏవిటన్నావ్?'అడిగాడు శాస్త్రి ఆలోచనల నుండి తేరుకుని.

"అదే ఈమధ్య అదోలా వుంటున్నారు,ఎందుకు ?" అడిగింది మళ్ళీ "ఏమీ లేదోయ్... చిన్న దాని పెళ్ళికి నా కొచ్చే పీ ఎఫ్, గ్రాట్యుటీ వగైరాలు సరిపోతాయి. ఇక చిన్న వాడి చదువు మరో మూడు సంవత్సరాలయితే అయిపోతుంది. రిటైర్మెంట్ ఇంకొంత కాలం తర్వాత ఉంటే బాగుండేది. " అన్నాడు.

"కొందరు విద్యార్థులకు మీరే ప్రతీ నెల, మీ జీతం నుండీ ఫీజులు కడుతూ వస్తున్నారు...ఇక అలాంటప్పుడు మన దగ్గర ఏం మిగులుతుంది" అంది.

పావని మళ్ళీ శాస్త్రి మనసులో బాధ అలుముకుంది.

"బ్యాంకులో ఎంతుంది?" అన్నాడు తనలో తాను గొణుక్కుంటూ.

"ఏదో.... వెయ్యి ఉంటుందనుకుంటా" అంది పావని.

మళ్ళీ కళ్ళు మూసుకుని ఆలోచనల్లోకి వెళ్ళిపోయాడు శాస్త్రి. అతనికి కణతల్లో నొప్పి మొదలైంది

నెల రోజులు గా సరిగా అన్నం సహించ లేదు శాస్త్రికి. నీరసంగా కనపడ సాగాడు. మనసంతా దిగులు తో నిండిపోయింది.

ప్రతి రోజూ చుట్టూ పక్కల ఊర్లలో వున్న సహోద్యోగులు , అధ్యాపకులు వచ్చి కలిసి పదవీ విరమణ అభినందనలు చెప్పసాగారు. వారి ముందు నవ్వుతున్నాడు కానీ మనసు లోపల ఏదో తెలియని దుఃఖం అలుముకుంది.

అఖరున, ఆ రోజు పదవీ విరమణ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. పై అధికారులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు శాస్త్రి జీవితాన్ని, అతను చేసిన మంచి పనులను అభినందించి, బోలెడు శాలువాలతో, పూల దండలతో ముంచెత్తారు.

అంగరంగ వైభవంగా సభ జరిగింది. పైకి నవ్వుతున్న శాస్త్రి మనసులో దిగులు మాత్రం తగ్గ లేదు..

ఆ రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరుకున్న శాస్త్రి, ధోవతి కట్టుకుని మంచం పైకి చేరుకున్నాడు.

"మీరు చాలా అదృష్టవంతులు. మీకు జరిగినట్లుగా పదవీ విరమణ కార్యక్రమం ఎప్పుడూ, నేను ఎవరికీ చూడ లేదు" గర్వంతో అంది పావని.

అతని భుజం మీద తల ఆనించి ,కాసేపట్లోనే తృప్తిగా నిద్ర పోయింది. మెల్లిగా పక్కకు జరిగి వచ్చేనెల పెన్షన్ మొత్తం గురించి ఆలోచించ సాగాడు శాస్త్రి.

పూర్తి జీతం వస్తే ఇంట్లో ఖర్చులు గడుస్తున్నాయి. 'ఇక మీదట సగంతో ఎలా నెట్టుకు రావాలి?' అనే ఆలోచనలతో సతమతమ వ్వసాగాడు. ఎటు వేపు తిరిగి పడుకున్నా నిద్ర పట్టటం లేదు. ఎలా చేయాలి ?, రేపటి నుండీ ఖర్చులు తగ్గించాలి అనుకున్నాడు.

అమ్మ,నాన్నా, పావని, తన మందులు తప్పించి మిగిలినఖర్చులు తగ్గించాలి. ఇక సంవత్సరం వరకూ బట్టలు కొనరాదు. బయట టీలు త్రాగ రాదు .

"చిన్న వాడి హాస్టల్, కాలేజీ ఫీజు ఇంకో మూడు సంవత్సరాలు కట్టేస్తే చాలు ఇంక తర్వాత పెన్షన్‌తో ఎలాగయినా పెద్ద కష్టం లేకుండా జీవితం నెట్టుకు రావచ్చు 'అనుకున్నాడు. కానీ ఈ మూడు సంవత్సరాలు ఎలా? అన్న ఆలోచనలతో

లేచి కూర్చున్నాడు. నిద్ర పట్టటం లేదు శాస్త్రికి. దేవుడి గది లోకి వెళ్లి అక్కడున్న అన్ని దేవుళ్ళ కు మొక్కాడు.

హాల్ లో నిద్ర పోతున్న అమ్మ, నాన్నలను చూసి మనసులో మొక్కుకున్నాడు.

తిరిగి మంచం మీద పడుకుని 'భగవంతుడా రేపటినుండి నీవే దిక్కు. నీదే భారం' అని మొక్కుతూ కళ్ళు మూసుకుని నిద్రకు యత్నించాడు

రాత్రంతా దేవుడిని తలూస్తూనే వున్నాడు. తెల్లవారుజామున నిద్ర పట్టింది. నిద్ర లో కూడా అతడి కళ్ళ లోనుండీ కన్నీళ్లు కారాయి.

మంచి నిద్ర లో పావని పిలుపు తో మెలకువ వచ్చింది శాస్త్రికి. కళ్ళు తెరిచాడు. నిద్ర లేమి తో కళ్ళు మంటగా అనిపించాయి.

"మీ గురించి ఎవరో వచ్చారు చూడండి. సమయం తొమ్మిది. భలే నిద్ర పోయారు" అంది.

"కూర్చో పెట్టు ..వస్తాను" అని లేచి పెరట్లోకి వెళ్లి అరగంటలో కాలకృత్యాలు తీర్చుకుని వచ్చాడు.

ముందు గదిలో కూర్చున్న వ్యక్తి లేచి నమస్కారం చేసి "సార్ మీ గురించి మా అయ్యగారు రత్నయ్య, మన ఎమ్మెల్యే గారు వచ్చారు. బయట కార్లో వున్నారు.. మీరు సరేనంటే లోనికి తీసుకొస్తాను" అన్నాడు.

అది విని బిత్తర పోయిన శాస్త్రి. "అరే ..బయట ఎందుకున్నారు, లోనికి రమ్మను "అని చెప్పి అక్కడున్న కుర్చీలు సరి చేసాడు.

కొద్ది సేపటిలో రత్నయ్య, ఆ ఊరి ఎమ్మెల్యే రాజా గారు లోనికి అడుగు పెట్టి శాస్త్రికి వినయంగా నమస్కారం చేశారు.

రత్నయ్య చేతులు కట్టుకుని కూర్చుని "సార్ ! నేను రత్నయ్య , మీ విద్యార్థిని సార్, వీరేమో మన ఎమ్మెల్యే రాజా. సార్. పదవ తరగతి లో మేమిద్దరం మీ విద్యార్థులం సార్. ఆ సంవత్సరం నాకు స్కూల్ ఫీజు తక్కువయితే మీరు ఇచ్చారు. మళ్ళీ తిరిగి ఇస్తే తీసుకోలేదు." అన్నాడు.

కళ్లద్దాలు సరి చేసుకుని వాళ్ళిద్దరినీ తేరిపారా చూసాడు శాస్త్రి. అసలు గుర్తు పట్ట లేక పోయాడు. "అలాగా బాబు..ఏమీ అనుకోకండి..చాలా కాలం గడిచింది కదా..గుర్తురావటం లేదు" అన్నాడు శాస్త్రి చిరునవ్వుతో.

"సార్ నాకు రెండు సంవత్సరాల పాటు పుస్తకాలన్నీ మీరే ఇప్పించారు. అప్పుడు మేము బీదరికం లో మునిగి వున్నాం సార్" అన్నాడు ఎమ్మెల్యే రాజా రావు. అలా చెప్తున్నప్పుడు అతని కంటి చూపుని సన్నని కన్నీటి పొర కప్పేసింది.జేబులోనుండీ తెల్లని రుమాలు తీసి కళ్ళు తుడుచుకున్నాడు రాజా రావు.

"మీరు చేసిన సహాయం, మాకు ప్రత్యేకంగా మీరు క్లాసులు తీసుకుని చెప్పిన చదువు, మేమెప్పుడూ మరువలేం సార్" అన్నాడు రత్నయ్య

అది వినగానే శాస్త్రి మొహం సంతోషం తో విప్పారింది. మనసులో గూడు కట్టుకున్న దిగులు ఎటో యెగిరి పోయింది. సంతోషంలో అన్నీ మరచి పోయాడు.

"చాలా సంతోషం బాబు. మీరు పెరిగి మంచి ఉన్నత స్థాయిలోకి వచ్చారు. అంతా భగవంతుడి దయ. నేను నా ఉద్యోగ ధర్మాన్ని పాటించాను." అన్నాడు తృప్తిగా.

" మీతో చిన్న పని మీద వచ్చాము సార్ ., ప్రస్తుతం నేను రియల్ ఎస్టేట్‌లో స్థిర పడ్డాను. ఇక్కడ పక్క ఊరిలో, బీద విద్యార్థులకు సరస్వతి విద్యా పీఠ్ అనే ఇంగ్లీష్ కళాశాల స్థాపించాను."అని చెప్పటం ఆపాడు రత్నయ్య.

"నాకు నిన్ననే పదవీ విరమణ అయ్యింది బాబు. నేనేం చెయ్యగలనిప్పుడు. అయినా చెప్పండి నాకు చేతనయ్యింది చేస్తాను" అన్నాడు శాస్త్రి.

"అది తెలిసే వచ్చాము సార్. మా కళాశాల ప్రిన్సిపాల్‌గా మీరుండాలి. మీరే దానికి అర్హులు. చాలా మంది మీ పేరు చెప్పారు. పైగా మీరు మా గురువులు. దయ చేసి మీరు రావాలి. ఇప్పుడిప్పుడే కొత్తగా పెట్టాము కనుక ఎక్కువ ఇచ్చుకోలేము. ప్రస్తుతానికి యాభై వేలు ఇస్తాము సార్." అన్నాడు ఎమ్మెల్యే రాజా రావు.

ఆశ్చర్యంతో నోట మాట రాలేదు శాస్త్రికి. విస్తుపోయి చూస్తూ వుండిపోయాడు. 'అంటే దాదాపుగా మళ్ళీ రేపటినుండి పెన్షన్ తో కలిపితె పూర్తి జీతం వస్తుంది. 'అనుకున్నాడు మనసులో శాస్త్రి మౌనంగా వుండటం చూసి అన్నాడు రత్నయ్య "సార్ మీరు దయ చేసి ఒప్పుకోవాలి" అన్నాడు.

"మీకు తెలుసో తెలీదో, నాకు కాలేజీ నడిపిన అనుభవం ఏమీ లేదు. మీరు పొరబడ్డారు. నేను కాలేజీ ప్రిన్సిపాల్ గా చేయటం కష్టం" అన్నాడు శాస్త్రి.

"పరవాలేదు సార్, మేమన్నీ మీకు ఒక్కొక్కటిగా చెప్తాము. మీరు అక్కడ సీట్లో కూర్చుంటే చాలు. ప్రతీ రోజు కాలేజీ జీప్ వొచ్చి మిమ్మల్ని తీసుకెళ్తుంది. మీ లాంటి గురువులు దొరకటం మా అదృష్టం ..మీరు కాదనకండి. ఇదుగో అడ్వాన్స్ గా లక్ష రూపాయల చెక్. మీ మీద మాకు పూర్తిగా నమ్మకం వుంది. నిన్ననే రిటైర్ అయ్యా రుగా, సార్, వారం తర్వాత మీరు కాలేజీ కి రండి" అని చెప్పి నిలబడ్డారు.

జరుగుతున్నదంతా విని కలో నిజమో తెలీని పరిస్థితిలో సరేనంటూ తలూపాడు శాస్త్రి. సంతోషం తో వాళ్ళు ఇద్దరూ లేచి రెండు చేతులెత్తి నమస్కారం చేసి బయటకు అడుగులు వేశారు.

తృప్తిగా నవ్వుతూ ఎదురుగా నిలబడ్డ పావని కేసి చూసి" రిటైర్మెంట్ అయ్యాక పెన్సన్‌తో మూడు సంవత్సరాలు బాబు చదువుకు ఎలా సర్దుబాటు చేయటం అని దాదాపుగా రెండు నెలల నుండీ మానసిక వ్యధను అనుభవించాను పావని . ఆ దేవుడే పంపించాడు వీళ్ళను." గద్గద స్వరం తో అంటూ భార్యమీద వాలి పోయి విలపించసాగాడు శాస్త్రి. ఇన్నాళ్లుగా అతని కడుపులో దాచుకున్న బాధ, దుఃఖం బయటకు తన్నుకుంటూ రాసాగింది.

"అవునండీ దేవుడికి కళ్లున్నాయి.. ఆయనెప్పుడూ న్యాయాన్ని కాపాడతాడు. మీరు చేసిన మంచితనం మీ వెంట వుంది. మీరు అందరికీ చేసిన సహాయం మిమ్మల్ని కాపాడుతుంది." అంది శాస్త్రి కళ్ళు తుడుస్తూ. వారం తర్వాత ఇంటి ముందు ఆగిన కాలేజీ కారెక్కి తృప్తిగా కూర్చున్నాడు శాస్త్రి. కార్ వేగంగా కాలేజీ వేపు సాగి పోయింది.

# హైస్పీడ్ రైలు కారిడార్



హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వరకు విజయవాడ మీదుగా జాతీయ రహదారి వెంట హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైల్వేశాఖ ప్రిలిమినరీ ఇంజనీరింగ్ అండ్ ట్రాఫిక్ (పెట్) సర్వే చేపట్టింది.

ఇందుకు సంబంధించిన బాధ్యతలను గత సంవత్సరం మే నెలలోనే ఎస్ఎం కన్సల్టెన్సీకి అప్పగించింది.

మార్చి నెలాఖరు నాటికి ప్రాథమిక సర్వే పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

ఈ సర్వే ఆధారంగా సమగ్ర నివేదిక (డీపీఆర్) రూపొందించనున్నారు.

దీని వల్ల రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలో జాతీయ రహదారి వెంట ఉన్న ప్రాంతవాసుల రైలు కల సాకారం కానుంది.

# కూరగాయ మొక్కలకు అంట్లు కట్టే కార్యక్రమానికి తరలి రండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కూరగాయ మొక్కలకు అంట్లు కట్టే కార్యక్రమానికి తరలి రండి అని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం శివాజీ పాలెం లోని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25 వ తేదీ ఉదయం 10 గంటల నుండి సింహాచలం గోశాలలో (జైలు రోడ్డు లోని) శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఇంటి వద్ద కూరగాయల పంటలు పండించే వారికి నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని, ఇది వారికి బాగా ఉపయోగపడుతుంది అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుండి ఇంటి వద్ద, ఇంటి పైన పంటలు పండించే వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొంది ఆరోగ్యం ఇచ్చే అమృత ఆహారం పండించు కోవాలని, తద్వారా ఆరోగ్యంగా జీవించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటి దగ్గర ఆరోగ్య కరమైన ఆహారం కోసం ఆహార పంటలు పండించడం అవసరం అన్నారు. రసాయన ఎరువులు రసాయన క్రిమి సంహారకాలు లేకుండా ఎవరి ఇంటికి కావలసిన కూరగాయలు ఇంటి వద్ద పండించు కోవాలని కోరారు.

సంస్థ కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు వాట్సాప్ ద్వారా వారి పేరు, వివరాలు 9866138129, 9966651052 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొని మాట్లాడారు.

# అభివృద్ధి - సంక్షేమానికే పెద్ద పీట



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ తూర్పు నియోజకవర్గం 17 వవార్డు ఆదర్శ్ నగర్ కాలనీలో మంగళ వారం నూతన సామాజిక భవనం నిర్మాణం కొరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం 25లక్షల రూపాయలు ఎంపీ నిధులతో విశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వార్డు కార్పొరేటర్ గేదల లావణ్య నాగరాజుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు. అనంతరం వార్డులో పర్యటించి స్థానికంగా ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకొని వాటిని కూడా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్స్పెక్టర్లు రాంబాబు, మనోహర్, విశాఖ మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ పిల్లా సత్యవతి, నీలా రెడ్డి, కాళ్ళ వరహాలు, జీవీఎంసీ సిబ్బంది గ్రామపెద్దలు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, కన్వీనర్లు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ఆర్థికసహాయం చేసిన ఎంవీవీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్థానిక జీవీఎంసీ 15 వార్డు సింహాద్రిపురం, న్యూ వెంకోజీపాలెం బాయ్స్ ప్రాంతానికి చెందిన పలువురు క్రీడాకారులకు మంగళవారం పార్లమెంట్ సభ్యులు, తూర్పు వైసిపి సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వార్డులో పర్యటించి క్రికెట్ క్రీడాకారులకు 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఎప్పుడూ నిలుస్తుందని, ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకముగా చేపట్టిన ఆడదాం ఆంధ్రలో ఎంతోమంది క్రీడాకారులు ప్రతిభను చూపించారని వారిని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లేందుకు లిఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిగారులి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య గిరిబాబు స్థానికులు పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛను కాపాడండి

## ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ చిన్నగదిలి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18వ తేదీన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణ పై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటనను ఖండిస్తూ ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళవారం చినగదిలి రూరల్ తాహసిల్దార్ శివన్నారాయణకు వినతిపత్రం సమర్పించింది. దాడి చేసిన వ్యక్తులను చట్టపరంగా కఠినంగా శిక్షించి, పత్రిక స్వేచ్ఛను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పతంలో పేర్కొంటూ ప్రభుత్వం దృష్టికి తమ నిరసన తీసుకువెళ్లాలని అసోషియేషన్ సభ్యులు తాహసిల్దార్ ను కోరారు. అదే విధంగా పెదగదిలి అంబెడ్కర్ విగ్రహం వద్ద ఆంధ్ర జ్యోతిపత్రికా ప్రతినిధి పై దాడిని నిరసిస్తూ పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినదించారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులకు మద్దతు పలుకుతూ తమ నిరసన వ్యక్తం చేశారు.

# జల్‌జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు

## జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు

**విజయనగరం:** గ్రామ జలసంఘాల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానంలో చేపట్టే జల్‌జీవన్ మిషన్ పనులు పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించే యీ కమిటీలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్.ఇ., జిల్లాపరిషత్ సి.ఇ.ఓ., జిల్లా పంచాయతీ అధికారి, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్, డి.డబ్ల్యు.ఎం.ఏ. ప్రాజెక్టు డైరక్టర్, సమగ్రశిక్ష ప్రాజెక్టు ఇ.ఇ., గ్రామీణ నీటిసరఫరా, సహజవనరుల నిర్వహణ, సమాజాభివృద్ధి రంగంలో నిపుణులైన ఒకరు సభ్యులుగా వుంటారని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్.ఇ. ఉమాశంకర్ తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఏ ఏజెన్సీకి అప్పగించని అంతర్గత నీటిసరఫరా, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానంలో చేపట్టేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.98 జారీచేయడం జరిగిందని యీ మేరకు జిల్లా స్థాయి కమిటీ గ్రామాల్లో చేపట్టిన పనులను పర్యవేక్షిస్తుందన్నారు. అదే విధంగా ఈ పనుల నిర్వహణలో వచ్చే సాంకేతిక, పరిపాలన పరమైన సమస్యల పరిష్కారం, పనులు చేపట్టేందుకు అవసరమైన సామాగ్రి సమకూర్చడంలో సహాయపడేందుకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్.ఇ. పేర్కొన్నారు.

# కళ్యాణమస్తుతో బాలికా విద్యకు తోడ్పాటు



**విజయనగరం:** రాష్ట్ర ప్రభుత్వం వై.ఎస్.ఆర్. కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కింద కులాంతర వివాహ ప్రోత్సాహాల నిమిత్తం ఇస్తున్న పారితోషికం కోసం విధించిన నిబంధనల కారణంగా ఆయా వర్గాల వారిలో బాలికా విద్య ప్రోత్సాహానికి తోడ్పాటు ఇవ్వడంతో పాటు ఆయా వర్గాల్లో తక్కువ వయస్సులోనే జరిగే వివాహాల నిరోధానికి కూడా ఉపయోగపడుతోందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకాల కింద వధూవరులు ఇద్దరూ పదో తరగతి ఉత్తీర్ణులు అయి ఉండాలనే నిబంధనల కారణంగా ఎస్.సి, ఎస్.టి., బి.సి., మైనారిటీ, భవన నిర్మాణ కార్మికులు, విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి పేద కుటుంబాల్లోని బాలబాలికలు తప్పనిసరిగా పదోతరగతి పూర్తి చేస్తున్నారని చెప్పారు. దీనితోపాటు ఈ పథకంలో వివాహం చేసుకునే వధువు వయస్సు కనీసం 18 సంవత్సరాలు, వరుని వయస్సు 21 సంవత్సరాలు ఉండాలనే నిబంధన కారణంగా నిర్ణీత వయస్సు వచ్చాకే పెళ్లిళ్లు జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐదో విడత వై.ఎస్.ఆర్. కళ్యాణమస్తు, షాదీ తోఫా ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు.

జిల్లాలో ఐదో విడతలో 370 జంటలకు రూ.2.35 కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేశారు. వీరిలో 296 మంది బి.సి., ఓ.సి. 1, ఎస్.సి. 60, ఎస్.టి. 13 జంటలు వున్నాయి. వీటిలో ఒకే కులంలో జరిగిన వివాహాలకు సంబంధించి 331 మందికి, కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు 34, విభిన్నప్రతిభావంతులు ఐదుగురు వున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఈ పథకం లబ్ధిదారులకు రూ.2.35 మొత్తం విడుదలకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్, ఇతర ప్రజా ప్రతినిధులు అందజేశారు.

జిల్లాలో గత ఐదు విడతల్లో వై.ఎస్.ఆర్. కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 3,239 మంది జంటలకు రూ.18.85 కోట్లు సహాయం అందించామని డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ చక్రవర్తి చెప్పారు. తొలివిడతలో 145 మందికి రూ. 0.98 కోట్లు, రెండో విడతలో 764 మందికి రూ.4.36 కోట్లు, 3వ విడతలో 1407 మందికి రూ.8.32 కోట్లు, 4వ విడతలో 478 మందికి రూ.2.80 కోట్లు, ద్వైవార్షిక పథకాల మంజూరులో భాగంగా 75 మందికి రూ.0.04 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, ఎం.ఎల్.సి. సురేష్‌బాబు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చిన రాము నాయుడు, డి.సి.ఎం.ఎస్. ఛైర్మన్ అవనాపు భావన, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ చక్రవర్తి, డి.ఎన్.డబ్ల్యు.ఓ.రామానందం, మైనారిటీ సంక్షేమ అధికారి రుద్రపాటి శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

# సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో సుంకర మెట్ట వద్ద శ్రీ సత్యనారాయణ స్వామి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో మాఘమాసం భీష్మ ఏకాదశి మంగళవారం సందర్భంగా ఆలయం మండపంలో దంపతులచే శ్రీ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు, ఈవో కీర్తి ఆదినారాయణ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర వైద్య విభాగప్రధాని కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ నరసింహారావు, గౌరీ పిఎసిఎస్ చైర్మన్ విల్లూరి శివ సూరి ఆలయం ఆలయ ప్రధాన అర్చకులు విద్యాసాగర్ శర్మ, ధర్మకర్తలు నేతల చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నర్సింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, తాడి నాగలక్ష్మి, విజ్జపుముకుంద, ఎం విద్యాసాగర్, శంకర్రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఖో ఖో పితామహుడు దివంగత దొడ్డి అప్పారావు మాస్టారు కుమారుడు దొడ్డి చంద్ర శేఖర్ హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ రిజిస్టర్డ్ అండర్ ఐ.టి.ఎ. నీతి అయోగి అండ్ ఎం.ఎస్ఎంఇ, (గవర్నమెంట్ అఫ్ ఇండియా) హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్‌కు నేషనల్ డైరెక్టర్‌గా, అలాగే యాంటీ కరప్షన్ ఫౌండేషన్ అఫ్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఇంటర్ నేషనల్ ఫెడరేషన్‌కు నేషనల్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ ప్రెసిడెంట్ నరేంద్రర్ అరోరా చేతుల మీదుగా అపాయింట్మెంట్ లెటర్ ఢిల్లీ లో తీసుకోవడం జరిగింది. చంద్ర శేఖర్ కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైసెషన్స్ స్టేట్ వైస్ ప్రెడెంట్ గా కొనసాగుతూ . అలాగే ప్రశాంతి నికేతన్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి నికేతన్ స్కూల్ ప్రెసిడెంట్ డి.వి. శ్రీనివాససరావు మరియు పాఠశాల సిబ్బంది అభినందించారు.

# ఎ.పి.ఎస్.సి. పరీక్షలను సజావుగా నిర్వహించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ఈనెల 25వ తేదీన నిర్వహించే ఎ.పి.పి.ఎస్.సి. పరీక్షలు సజావుగే జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో ఈ విషయమై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముం దస్తు ఏర్పాట్లలో చిన్న పొరపాటుకు కుడా ఆస్కార మీయకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టా లన్నారు. పరీక్షలు జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెంలలో 33 విద్యా సంస్థల్లో ఉ.గం.10-30ల నుండి మధ్యాహ్నం 1-00 వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలలో తగిన మౌలిక వసతులు ముందుగా కల్పించాలన్నారు. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 10,627 మంది అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. రూట్ ఆఫీసర్స్ అయిన జిల్లా అధికారులు లైసన్ అధికారులైన తాశీల్దార్లు, ఎం.పి.డి.వో.లు వారికి కేటాయించిన పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, తాశీల్దార్లు, ఎం.పి.డి.వోలు, సెక్షన్ సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, ఎస్.ఎ.రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులదే

## అనకాపల్లి తెలుగుదేశం పార్టీకి కంచుకోట




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** "ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మద్యపానం నిషేధం అన్నారు. మద్యపానం నిషేధం లేదు సరి కదా బూమ్ బూమ్ షాపులు తెరిచార"ని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సోమవారం అనకాపల్లి జరిగిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. జగన్ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ అనే పేరు అనారోగ్యశ్రీగా మారిందని అన్నారు. అమ్మ ఒడి ఎంతమంది బిడ్డలు ఉంటే అందరికీ వేస్తానన్నారు. చేశారా లేదా అని జనాన్ని ప్రశ్నించారు. పేదలకు 30 లక్షలు ఇళ్ళు కడతాను అని మోసం చేశానన్నారు. రెండు నెలలు ఓపిక పడితే షర్టు మడత పెట్టడం కాదు నీ కుర్చీని ఐదు కోట్ల జనం మడత పెట్టేస్తారు అని జగన్ ఉద్దేశించి అన్నారు. కరెంట్, ఆర్టీసీ, ఇంటి పన్ను, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజలపై బాదుడే బాదుడు. టిడిపి జనసేన ప్రభుత్వం వస్తే వైసిపి సంక్షేమ పథకాలు కట్ చేస్తారు అని వాలంటీర్లతో చెప్పిస్తున్నారు. టిడిపి జనసేన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చే వరకు మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. స్కూల్స్‌కి వెళ్లే ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఎకౌంట్లో ప్రతి సంవత్సరం 15000 రూపాయలు వేస్తాం. ఒక్కరు ఉంటే ఒక్కరికి ముగ్గురు ఉంటే ముగ్గురికి ప్రతి రైతుకి అండగా ప్రతి ఏటా రైతుకి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తాం.

ప్రతి ఒక్క ఇంటికి ప్రత్యేక మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. 18 నుండి 50 సంవత్సరాల మహిళలకు ప్రతినెల 1500 రూపాయలు ఇస్తాం.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్మోహన్ రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యం పెట్టుకుంది.

టిడిపి జనసేన ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అవ్వకుండా ఆపుతాం అన్నారు. అనకాపల్లికి టిడిపి కంచుకోట అనకాపల్లి బెల్లం చాలా ఫేమస్ కానీ వైసీపీ ప్రభుత్వ విధానాలు కారణంగా బెల్లం ఎగుమతులు దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి. టిడిపి ప్రభుత్వంలో పీలా గోవింద సత్యనారాయణ వెయ్యి కోట్లు ఖర్చుపెట్టి నియోజకవర్గం అభివృద్ధి చేశారు అన్నారు.

నేను గ్రామీణ అభివృద్ధి శాఖలో పని చేసేటప్పుడు 2020 కోట్లు ఇంటింటికి కొళాయిలు సిసి రోడ్లు కళ్యాణ మండపాలు వివిధ రకాలైనటు వంటి అభివృద్ధి పనులు ప్రారంభించాంకానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ అభివృద్ధి పనులన్నీ నిలిపివేసింది అన్నారు. సభ ప్రారంభంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహానికి లోకేష్‌తో సహా వేదిక పైనున్న వారు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, పార్టీ అనకాపల్లి నియోజకవర్గం ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ, జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి రత్నాకర్, మాధంశెట్టి నీల బాబు, కొట్ని బాలాజీ దాడి జైవీర్, కాయల మురళి తదితరులు పాల్గొన్నారు. లోకేష్ శంఖారావం సభకు భారీగా జనం తరలివచ్చారు.

# మంత్రి అమర్నాథ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లిలో జరిగిన శంఖారావం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ లపై లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రింగ్ రోడ్‌లో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బయ్యవరం జమాదుల పాలెంలో 600 ఎకరాలను అమర్నాథ్ కబ్జా చేశారని అవాస్తవ ఆరోపణలు చేశారని కనీసం ఒక్క సెంటు భూమైన కబ్జా జరిగినట్టు దమ్ముంటే నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. అనకాపల్లిలో కోట్ల రూపాయలతో అమర్నాథ్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయన చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆయన అన్నారు.

జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర ఇచ్చిన హామీలన్నీ నూటికి నూరు శాతం అమలు చేశారన్నారు. నవరత్నాలు తు.చ. తప్పకుండా అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిగా అన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగరవేయడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి దంతులూరు దిలీప్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో మంత్రి అమర్నాథ్ నియోజకవర్గంలో కోట్ల రూపాయల్లో అభివృద్ధి పనులు చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి సభలకు వస్తున్న జన ప్రభంజనాలు చూసి ఓర్వలేక దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమల శాఖ మంత్రిగా కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి అమర్నాథ్ తీసుకొచ్చారన్నారు. అయితే మంత్రిగా గతంలో లోకేష్ ఎన్ని పరిశ్రమలు రాష్ట్రాన్ని తెచ్చారో చెప్పాలన్నారు. అమర్నాథ్ విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, జడ్పీ వైస్ చైర్మన్ బివి సత్యవతి, వైసిపి నాయకులు మల్ల బుల్లిబాబు, పెద్ద శెట్టి గోవిందా, కలగా గున్నయ్య నాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, దాడి నారాయణరావు, విల్లూరి శివ సూర్య నారాయణ, వేగి త్రినాథ, కోన ఉమా, జాజుల రమేష్, కె.ఎం. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పద్ధతిలో ట్రాఫిక్ సిగ్నల్ కనుగొన్న డైట్ విద్యార్థులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రస్తుత కాలంలో ట్రాఫిక్ నియంత్రణ పెద్ద సవాలుగా మారింది. దీనికి కారణం సిగ్నల్ వ్యవస్థ పై వాహన చోదకులకు అవగాహన లేకపోవడమే.ఈ సమస్యకు పరిష్కారం చూపారు స్థానిక డైట్ అటోనమస్ కళాశాలలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం సి.ఎస్.డి చదువుతున్న విద్యార్థులు చల్లా లక్ష్మి ఐశ్వర్య, పి. వి. కె.ఉమసుప్రజ నూతన పద్ధతిలో ట్రాఫిక్ సిగ్నల్ పరికరం కనుగొన్నారు .ఈ పరికరంతో ట్రాఫిక్ సిగ్నల్ పడే ముందు దీనికి అమర్చిన బ్లింకింగ్ లైట్ ద్వారా స్టాప్ (రెడ్ లైట్), స్టార్ట్ (గ్రీన్ లైట్) వెళ్ళే వాహన చోదకులు అప్రమత్తం అవ్వడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని ప్రాజెక్ట్ ఇంజనీర్ భమిడిపాటి శేషగిరి రావు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ చేయడానికి ఈ. సి. ఈ విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణ ప్రియ సహకరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ కె.పార్వతి, ఈ.సి.ఈ విభాగాధిపతి పి.పూర్ణ ప్రియ విద్యార్థులను అభినందించారు. ఎప్పుడు సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్ట్ చేసే బి. శేషగిరి రావును ప్రశంసించారు.

# కేంద్రీయ విద్యాలయం మూసివేత ప్రతిపాదన తక్షణం విరమించుకోవాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్రీయ విద్యాలయం మూసివేత ప్రతిపాదన తక్షణం విరమించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగా రావు డిమాండ్ చేశారు. నేడు స్టీల్స్ సిఐటియు మరియు మిత్రపక్షాల అధ్వర్యంలో ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాను నుద్దేశించి డాక్టర్ బి. గంగా రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బయట ప్రచారంలో ఒక రకంగానూ ఆచరణలో వేరొకరకంగానూ వ్యవహరిస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగుల పిల్లలకు విద్య అందించాల్సిన ప్రధాన బాధ్యతనుండి యాజమాన్యం తప్పుకోవడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. కనుక ఇటువంటి ప్రతిపాదనలను యాజమాన్యం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సిఐటియు గౌరవాధ్యక్షులు జె. అయోధ్య రామ్ మాట్లాడుతూ దీనిని 1983లో ప్రారంభించారని నేడు దీనిలో 1050 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని ఆయన అన్నారు. వీరి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే యాజమాన్య వైఖరి అత్యంత దుర్మార్గమని ఆయన వివరించారు. దీనికి నేటి వరకు యాజమాన్యం అందిస్తున్న ఆర్థిక మరియు సహాయ సహకారాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ దీనిలో క్లాస్ 1 మరియు 11 తరగతిలో రానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ఇవ్వట్లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల సంఖ్య ఒక సెక్షన్‌కు 40కి మించరాదని కానీ నేడు అది 80 వరకు ఉందని ఆయన అన్నారు. అలాగే నాణ్యమైన విద్యు లభిస్తుందన్న ఆశతో తల్లిదండ్రులు ఇక్కడ తమ పిల్లలను జేర్పిస్తున్నారని, కానీ నేడు ఆ విద్యను బోధించే ఉపాధ్యాయులు కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ఈ చర్యల ద్వారా విద్యార్థులు దీనిపై విశ్వాసాన్ని కోల్పోతారని ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ చర్యలను ఉపసంహరించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు.

స్టీల్ సీఐటీయూ అధ్యక్షులు వై టి దాస్, మిత్రపక్షాల నాయకులు డివి రమణారెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యం పిల్లల భవిష్యత్తుతో ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాపారానికి దిగరాదని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యలను తక్షణం విరమించుకొని యధాస్థితిని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు మొహిద్దిన్, మహేష్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు నవ్య, జ్యోతి, పద్మావతి, హేమ, వినీల, తారకేష్, ప్రసాద్, ప్రదీప్, భాస్కర్, సత్యానంద, ప్రతాప్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రబీ పంటలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థాన డాక్టర్ కె.వి రమణమూర్తి సేద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తెగుళ్ల విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వి.చంద్రశేఖర్, ప్రాంతీయ కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏబీయం శిరీష, డి.ఆర్.సి. అనకాపల్లి వ్యవసాయ అధికారి తులసి, యలమంచిలి వ్యవసాయ ఉపసంచాలకులు రవి ప్రకాష్‌లు యలమంచిలి మండలంలో యలమంచిలి, కొత్తపాలెం, రాంబిల్లి మండలం పంచదార్ల, మామిడి వాడ గ్రామాలు, అచ్యుతాపురం మండలం తిమ్మరాజు పేట, పెదపాడు గ్రామాలు సందర్శించారు. పెసర, మినుము, జనుము పొలాలను సందర్శించి, పొలంలో బూడిద తెగులు గమనించి వాటి నివారణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ నువ్వులలో 25 నుంచి 30 రోజులకు ఆరుపదునుగా తడి ఇచ్చి ఎకరానికి పాతిక కేజీల యూరి యా చల్లుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల వ్యవసాయాధికారులు మోహన్ రావు, శంకర్ గోవింద్, సుమంత, అభ్యుదయ రైతులతో పాటుగా గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు ఏ ఈ ఓ దేవుడు, సంతోషి, ప్రవీణ, నీరజలు పాల్గొన్నారు.

# సెయింట్ జోసెఫ్ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా అంతర్ కళాశాలల పోటీలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల భాషాకేంద్ర అధ్వర్యంలో అంతర్ కళాశాలల అకడమిక్ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. లాంగ్వేజ్ సెంటర్ కోఆర్డినేటర్ ఆంగ్ల అధ్యాపకురాలు వీణా స్పందన మాట్లాడుతూ తెలుగు, హిందీ, సంస్కృత, ఆంగ్ల భాషల్లో విద్యార్థుల సృజనకు పదును పెడుతూ వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తమ కళాశాల విద్యార్థులతో పాటు నగరంలో 10కి పైగా కళాశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీలకు విచ్చేస్తున్నారని తెలిపారు.

ప్రెస్ ఇన్చార్జ్ డా. పి.కె. జయలక్ష్మి మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 వరకు కార్యక్రమం జరుగుతుందని, విజేతలకి ప్రమాణ పత్రాలు అందచేస్తామని చెప్పారు.

# 367 జంటలకు కళ్యాణమస్తు విడుదల



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** కాకినాడ జిల్లా లో వైఎస్సార్ కళ్యాణమస్తు", "వైఎస్సార్ షాదీ తోఫా"కింద అక్టోబర్-డిసెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 367 జంటలకు రూ.2.66 కోట్ల రూపాయల ఆర్థిక సాయం లబ్ది పొందుతున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

పేదింటి ఆడ పిల్లలకు పెళ్లి కానుక గా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా. అక్టోబర్- డిసెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు", "వైఎస్సార్ షాదీ తోఫా" క్రింద ఆర్థిక సాయాన్ని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో నిధులు విడుదల చేశారు గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టర్ కార్యాలయం లోని వివేకానంద హాలు నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎం ఏల్ సి కర్రి పద్మశ్రీ, కూడా చైర్ పర్సన్ రాగి రెడ్డి చంద్రకళ దీప్తి, డి ఆర్ డి ఏ పి డి శ్రీ రమణ, మెప్మా పీడి ప్రియంవద, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించే తమ సామాజిక బాధ్యత నిర్వర్తించేందుకు అండగా నిలుస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు "వైఎస్సార్ కళ్యాణమస్తు" ద్వారా, మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు "వైఎస్సార్ షాదీ తోఫా" ద్వారా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పిల్లలు పెద్ద చదువులు చదవాలన్న తపనతో వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫాలకు పదవ తరగతి ఉత్తీర్ణత, వధువుకు కనీస వయోపరిమితి వదువుకి 18 ఏళ్ళుగా, వరునికి 21 ఏళ్ళుగా నిర్దేశించిన ప్రభుత్వం.

చిన్నారులు పదో తరగతికి వచ్చే సరికి వారికి 15 ఏళ్ళ వయసు వస్తుంది, మన ప్రభుత్వం 1 వ తరగతి నుండి అప్పటికే ఏటా అందిస్తున్న రూ. 15,000 జగనన్న అమ్మ ఒడి సాయం ఇంటర్ వరకూ కూడా ఇస్తుండటంతో వారికి 17 ఏళ్ళ వయస్సు వచ్చే సరికి వారి ఇంటర్ చదువు కూడా పూర్తవుతుంది.

కళ్యాణమస్తు, షాదీ తోఫాలలో వధువుకు 18 ఏళ్ళు, వరునికి 21 ఏళ్ళ వయో పరిమితి ఉండటం, మన ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీఇంబర్స్మెంట్, జగనన్న వసతి దీవెన ద్వారా ఏటా రూ. 20,000 వరకు ఆర్థిక సాయం ఎలాగూ అందిస్తుండడంతో పాటు కళ్యాణమస్తు, షాదీ తోఫా ప్రోత్సాహకాలు కూడా ఉండడంతో వారు గ్రాడ్యుయేషన్‌లో చేరుతారు, పూర్తి చేస్తారన్న నమ్మకంతో పాటు బాల్య వివాహాలకు కూడా అడ్డుకట్ట వేయడం జరుగుతుందన్న తపన, తాపత్రయంతో ప్రభుత్వం పని చేస్తుదని కలెక్టర్ అన్నారు.

వైఎస్సార్ కళ్యాణమస్తు/ వైఎస్సార్ షాదీ తోఫా ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం పూర్తయిన వెంటనే చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.


Sugar Free Fitearly | నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కం మైన ఫలితాలను ప్రకటించు కోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి

ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179

ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED ® HEALTH AND HAPPINESS

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రతి ఒక్కరూ యోగాభ్యాసం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చుని యోగా గురువు భారత పతంజలి యూనిట్ అధ్యక్షుడు స్వామి పరమార్థదేవ్ అన్నారు. మంగళవారం స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ పతంజలి యోగ సమితి అధ్యక్షుడు దొరమనాయుడు ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్వామి పరమార్థదేవ్ మాట్లాడుతూ యోగా సాధన ద్వారా వచ్చే ప్రయోజనాలను యోగాభ్యాసకులకు వివరించారు. యోగా అభ్యాసం ద్వారామానవ జన్మను సార్థకం చేసుకోవాలని సందేశం ఇచ్చారు. ప్రపంచాన్నే ఆరోగ్యం వైపు నడిపే చక్కటైన మార్గాలు ఉన్నది ఒక యోగ శక్తికి మాత్రమేనని అన్నారు. అనేక అనారోగ్య సమస్యలకు (మానసిక ఒత్తిడి, గ్యాస్ట్రిక్, షుగర్, బిపి, ఊబకాయ, థైరాయిడ్, వెన్నుపూస, కీళ్ల నొప్పులకు) వంటి దీర్ఘకాల సమస్యలకు ఏకైక సంజీవిని యోగా మాత్రమే అన్నారు. యోగా అభ్యాసం లో ఆంధ్రప్రదేశ్ బాగా వెనకబడి ఉందని ఈ సాధనల చేసే వారి నుండి దరఖాస్తులు తీసుకొని వారికి నైపుణ్యత కలిగించేందుకు యోగా నిపుణులచే శిక్షణ ఇస్తామన్నారు. అంతర్జాతీయ సర్టిఫికెట్ ఇచ్చి దేశం మొత్తం యోగ బోధకులను తయారు చేసే ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు చిన్న బాబు, జొన్నలగడ్డ శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి రిత్ దేవ్, సచిన్ జి యోగాసనాలు ప్రదర్శించి అభ్యాసకులను అలరించారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జి. మంగయ్య హిందీ నుండి తెలుగులోకి తర్జుమా చేసి అందరికీ అర్థమయ్యే విధంగా, అందరినీ ఆనందకరంగా ఉంచారు. మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సుమారు 500 కు పైగా హాజరైనారు. క్లబ్ అధ్యక్షులు కోలపర్తి కన్నబాబు, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డా. విష్ణు మూర్తి నోట్ బుక్స్ పెన్స్ విద్యార్థులు కు స్వామి వారి ద్వారా అందజేశారు. అనకాపల్లిలో ఒక విధమైన ఆధ్యాత్మిక, ఆరోగ్య వాతావరణాన్ని సృష్టించిన స్వామి పరమార్థదేవును జార్జి క్లబ్ యోగా సాధకులు ఘనంగా సన్మానించారు.

# జిల్లాలో కళ్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా రూ.1.93 కోట్ల సాయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వై.ఎస్.ఆర్. కళ్యాణ మస్తు, షాదీ తోఫా ద్వారా వధువు తల్లి దండ్రులకు ఆర్థిక చేయూత చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ పథకం వల్ల జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు

రూ.1.93 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని వివరించారు. బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువు తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.

వై.ఎస్.ఆర్ కళ్యాణ మస్తు, వై.ఎస్.ఆర్. షాదీ తోఫా 5వ విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించి, బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమచేశారు.

కార్యక్రమంలో కలెక్టర్ వీసీ హాలు నుంచి వర్చ్యువల్ విధానంలో లబ్ధిదారులు, ఇతర అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ భాగస్వామ్యమయ్యారు.

వీడియో సమావేశం అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ - డిసెంబర్ 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 291 మంది లబ్ధిదారులకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా రూ.1 కోటి 92 లక్షల 80 వేలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 54 బిసి-ఎ జంటలకు రూ.28.25 లక్షలు, 36 బిసి-బి జంటలకు రూ.19.50 లక్షలు,130 బిసి-డి జంటలకు రూ.68.25 లక్షలు,15 బిసి-ఇ జంటలకు రూ.15.40 లక్షలు, 46 ఎస్.సి జంటలకు రూ.49.40 లక్షలు, 3 ఎస్.టి జంటలకు రూ.3.60 లక్షలు, ఒక భవన నిర్మాణ కార్మికుల జంటకు 40 వేలు, 5 దివ్యాంగ జంటలకు రూ.7.50 లక్షలు, ఒక మైనారిటీ జంటకు 0.50 లక్షలు మంజూరయ్యాయని వివరించారు.

**ప్రభుత్వ ఆర్థిక సాయంతో తమ కుటుంబాలకి లబ్ధి చేకూరింది : లబ్ధిదారుల మనోగతం**

1. తాటిచెట్లపాలెంకి చెందిన పామల ఉమా మహేశ్వరి వై.ఎస్.యస్.ఆర్. కళ్యాణమస్తు ద్వారా రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందనుండడం పట్ల ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమది 36వ వార్డు అని, ఆ వార్డులో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పథకం క్రింద లబ్ది కలుగుతుందని అన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో వై.యస్.ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా మంచి కార్యక్రమాలని కొనియాడారు. నాలుగు మాసాల క్రితమే తనకు వివాహం అయిందని, సచివాలయ సిబ్బంది ద్వారా ఈ పథకం గురించి తెలుసుకొని దరఖాస్తు చేసుకుంటే వై.ఎస్.ఆర్. కళ్యాణమస్తు మంజూరైనట్లు తెలిపారు. తమది చాలా పేద కుటుంబమని, ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయంతో తమ కుటుంబానికి ఎంతో మేలు జరిగిందని వివరించారు.

2. విశాఖ రూరల్ మండలం మారికవలసకు చెందిన మరో లబ్ధిదారు పడాల కుమారి, తనకు కళ్యాణ మస్తు కింద రూ.1.20 లక్షల ఆర్థిక సాయం మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని వృథా చేయకుండా ఉపయోగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర నగరాలు సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ పి.సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్. శోభా రాణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె. శ్రీదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్.జ్యోతి మాధవి, ఇతర అధికారులు, వధూవరులు, తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యం ఎంతో అవసరం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని, వ్యక్తుల ఆలోచనలు, ఉద్రేకాలు, ప్రవర్తన, వైఖరులు మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయని ఆదిత్య జిల్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ "ఎంపవర్" కార్యక్రమ స్టేట్ సైకాలజిస్ట్ మౌనికా రావు అన్నారు. స్థానిక ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం ప్రోగ్రాం అధికారులకు నిర్వహించిన మానసిక ఆరోగ్య శిక్షణా కార్యక్రమంలో ప్రధాన రిసోర్స్ పర్సన్‌గా ఆమె మాట్లాడుతూ సమాజంలో మానసిక సమస్యల చర్చపై ఉన్న అపోహలను పోగొట్టడానికి, మానసిక సమస్యలపై ధైర్యాన్ని ఇవ్వడానికి, సమస్యల పరిష్కారానికి, ఆత్మహత్యల నివారణకు జాతీయ సేవా పథక అధికారులకు, వలంటీర్లకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో అవసరమని అన్నారు. మానసిక ఆరోగ్యం వల్ల ప్రజలు తమ శక్తి సామర్థ్యాలను పూర్తిగా తెలుసుకొని, వాటిని సద్వినియోగం చేసుకో గలరని, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన గలరని ఆమె అన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపవర్ కార్యక్రమ స్టేట్ కో-ఆర్డినేటర్ బి.సుధాకరరావు ఒత్తిడిని తట్టుకునే మార్గాలను గురించి వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవాపథక ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా॥ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ ప్రతి ప్రోగ్రాం అధికారి యువత ఎదుర్కొనే మానసిక సమస్యలకు తగిన పరిష్కారాలను సూచించాలని, సమాజంలో మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి మార్గ నిర్దేశం చెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్. భాగ్యలక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రోగ్రాం అధికారులు, జాతీయ సేవా పథక కార్యాలయ సిబ్బంది, సీనియర్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలో భాగంగా ప్రోగ్రాం అధికారులకు "ఎంపవర్" కార్యక్రమ నిర్వాహకులు శిక్షణా సామాగ్రితో, సమాచారంతో కూడిన కిట్స్ ను పంపిణీ చేసారు. ముఖ్యంగా నగరంలో ఉన్న సమత కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజేష్, వ్యాయామ విభాగ అధిపతి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.రామకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యం అనే వాస్తవాన్ని వైసీపీ ప్రభుత్వం పరిపూర్ణం చేసింది



**కె.కోటపాడు:** గ్రామ స్వరాజ్యం అనే వాస్తవాన్ని వైసీపీ ప్రభుత్వం పరిపూర్ణం చేసిందని ప్రజలకు అన్ని విధాలా నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రాధాన్యత భవనాలు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని పంచాయతీ రాజ్ మంత్రి తెలిపి, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.4.97 కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ప్రాధాన్యత భవనాలను, సీసీ రోడ్లను, ఇంటింటి కుళాయిలు, అంగన్వాడీ కేంద్రంను అయన ప్రారంభించారు.

పాడుగుపాలెం గ్రామంలో తొలుత శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని అనంతరం గ్రామంలో 35 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను, 47.50 లక్షల రూపాయల జల్ జీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటులో భాగంగా ఇంటింటి కుళాయిలు అదనపు నీటి అవసరాల నిమిత్తం వేల లీటర్ల నీటి సామర్ధ్యంతో ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్ ను, 43.60 లక్షల రూపాయల నిధులలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, 23.94 లక్షల రూపాయల వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని, 20.80 లక్షల రూపాయల వ్యయంతో వైఎస్ఆర్ గ్రామీణ హాస్పటల్ (క్లినిక్ హెల్త్ సెంటర్)ను ప్రారంభించారు.

చింతపాలెం గ్రామంలో ?50 లక్షల రూపాయల నిధులతో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటులో భాగంగా అదనపు నీటి అవసరాల నిమిత్తం వేల లీటర్ల నీటి సామర్ధ్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ఏ. కోడూరు గ్రామంలో రూ.25 లక్షల రూపాయల నిధులలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.84 లక్షల రూపాయల వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 20.80 లక్షల రూపాయల వ్యయంతో వైఎస్ఆర్ గ్రామీణ హాస్పటల్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ను, రూ.1.17 కోట్ల రూపాయల నిధులతో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటులో భాగంగా అదనపు నీటి అవసరాల నిమిత్తం వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ ను ప్రారంభించారు.

42 లక్షల రూపాయల నిధులతో వారాడ నుండి ఉగ్గిన వలస వరకు అర్.వై అగ్రహారం మీదుగా తారు రోడ్డు మరమ్మత్తులు, పునర్నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

వారాడా సంతపాలెం తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి 11 లక్షల రూపాయల

నిధులతో నిర్మించిన సీ,సీ కాలువలు, చేతి పంపును, రూ. 23.94 లక్షల రూపాయల వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని, 20.80 లక్షల రూపాయల వ్యయంతో వైఎస్ఆర్ గ్రామీణ హాస్పటల్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను, రామచంద్రపురం గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్ర నూతన భవనాన్ని చిన్నారులచే ఘనంగా ప్రారంభించారు.

రూ.37 లక్షల రూపాయల నిధులతో ఆధునీకరించి కె.కోటపాడు మండల ప్రజా పరిషత్ భవన శిలాఫలకాన్నీ ఆవిష్కరించారు.

అనంతరం మండలంలోని పలువురు వాలంటీర్లకు డిప్యూటీ సియం సర్టిఫికేట్, బ్యాడ్జ్, మెడల్ అందజేసి శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, మండలగ్రామ స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మశాన వాటిక ఆక్రమణకు గురి కాకుండా ప్రహరీ గోడ మంజూరు చేయాలి

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** అరకు వేలి ఏరియా ఆసుపత్రి ప్రక్కన సర్భగుడ, కంటభౌంసుగుడ, హౌసింగ్ కాలనీ, సి కాలనీ గిరిజనులకు సంబంధించిన స్మశాన వాటికను తక్షణమే ప్రహరి గోడ నిర్మించి కాపాడాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు డిమాండ్ చేశారు.

రోజు రోజుకి చుట్టూ ఆక్రమణకు గురి అవుతున్న స్మశాన వాటికకు చట్టబద్ధత చేసి ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులకు ప్రభుత్వంపై ఉన్నప్పటికీ కనీసం స్పందించకపోవడంతో స్మశాన వాటిక అక్రమణకు గురి అవుతుంది. ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ ద్వారా నిధులు మంజూరు చేసి తక్షణమే స్మశాన వాటికను కాపాడటానికి గౌరవనీయులు శాసనసభ్యులు వారు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. చొంపి రోడ్డు రైల్వేట్రాక్ హైవే మధ్య ఉన్నా భరియల్ గ్రౌండ్ కి మంజూరు చేసినట్టు కంటబౌంసుగుడ, శర్భగుడ, హౌసింగ్ కాలనీ, సి కాలనీ గ్రాములో పెద్దసంఖ్యలో ఉన్న జనాభా కుటుంబానికి భవిష్యత్తులో స్మశాన వాటిక లేకుండా సమస్య ఏర్పడే అవకాశం ఉంది ఇటువంటి పరిస్థితుల్లో స్మశాన వాటికను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.






VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676